రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 53 | బుధవారం | 7.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 53 | Wednesday | 7.10.2026 | Pages: 8 | Rate: 2



6లో..

జ్ఞానేశ్ గో బ్యాక్..

కొత్త నినాదంతో కేంద్రానికి సెట్ బ్యాక్

• సీఈసీతో అమీతుమీ.. నిరసనలతో రాజకీయ సునామీ

ఢిల్లీ రోడ్లపై ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు కదిలిన ప్రతిపక్ష ఎంపీల మార్చ్‌ను బారికేడ్లు అడ్డుకున్నాయి. నినాదాలు మిన్నంటాయి. పోలీసులు అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ బారికేడ్ ఎక్కారు. ప్రియాంక గాంధీతో పాటు పలువురు నేతలు నిర్బంధానికి గురయ్యారు. చివరకు ఆకాశవాణి భవన్ సమీపంలోనే ఎంపీలు బైఠాయించి ధర్నాకు దిగారు. "జ్ఞానేశ్ భ్రో.. ఇక చాలు.. రాజీనామా చేయి" అంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య ఢిల్లీ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టించింది. కానీ ఈ ఆగ్రహానికి అసలు కారణం ఏమిటి? ఫామ్6లో మార్పులపై సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు ఈ పోరాటాన్ని ఎందుకు మరింత తీవ్రం చేశాయి? సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల వెనుక అసలు రాజకీయ వ్యూహం ఏమిటి? "తొలుబొమ్మ పోవాలి.. ఆడించే ఇద్దరు కూడా బాధ్యత వహించాలి" అంటూ కాంగ్రెస్ మోదీషాపై ఎందుకు నేరుగా గురిపెట్టింది? మరోవైపు బీజేపీ మాత్రం ఇది రాహుల్ రాజకీయ పునరాగమనానికి మరో ప్రయత్నమేనంటోంది. ఈ పోరాటం కేవలం ఒక సీఈసీ రాజీనామా డిమాండ్‌గా ముగుస్తుందా? లేక దేశ ఎన్నికల వ్యవస్థపై మరింత పెద్ద రాజకీయ, న్యాయ పోరాటానికి నాంది పలుకుతుందా? ఢిల్లీ బారికేడ్ల దాటి ఆందోళన ఎందుకు జరుగుతోంది? దేశ ప్రజాస్వామ్యం ఇప్పుడు ఏ మలుపు తిరగబోతోంది?





3లో..

మోదీ, షా, భాగవత్ తప్పించుకోలేరు

- ఓటు చోరీ ఆరోపణలపై రాహుల్ రణభేరి
- 300 ఎంపీలతో ఈసీ భేటీకి విపక్షాల డిమాండ్

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన మంగళవారం ఉత్కంఠకు దారితీసింది. పార్లమెంట్ మకర ద్వార్ నుంచి ఇండియా కూటమి ఎంపీలు ఉదయం 11 గంటల సమయంలో "సేవ్ డెమోక్రసీ" నినాదాలతో నిర్వాచన్ సదన్ వైపు మార్చ్ ప్రారంభించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్ వద్ద పోలీసు అంక్షలను ఎదుర్కొన్నారు.

మోదీ, షా, భాగవత్‌పై రాహుల్ ఆరోపణలు

ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో పోలీసులతో ప్రతిష్ఠంభన మధ్య మాట్లాడిన రాహుల్ గాంధీ.. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ జ్ఞానేశ్ కుమార్ సహకారంతో "ఓటు చోరీ" చేశారని ఆరోపించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని, ఈ వ్యవహారాన్ని "దేశద్రోహం"గా అభివర్ణించారు. "ఎవరూ తప్పించుకోలేరు.. చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. 300 మందికి పైగా లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు వచ్చారని చెప్పారు.



జ్ఞానేశ్ అసలేం చేశాడు?

వివరాలు 7లో..

- సర్ చుట్టూ రాజకీయ తుపాన్
- సీఈసీపై అనుమానం ఎక్కడ మొదలైంది?
- ఓట్ల జాబితా మార్పుల వెనుక రహస్యమేంటి?

ఓటు.. ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఆ ఓటు ఎవరిది? ఎవరి పేరుంది? ఎవరి పేరు మాయమైంది? ఇప్పుడు ఈ ప్రశ్నలే దేశ రాజకీయాలను కుదిపేస్తున్నాయి. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ... సర్.. చుట్టూ మొదలైన వివాదం, ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవికే సవాల్‌గా మారింది. విపక్షాలు వీధుల్లోకి వచ్చి "ఓటు చోరీ" అంటూ నినదిస్తున్నాయి. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు సాగిన ఆందోళనల్లో రాజీనామా డిమాండ్ మార్మోగుతోంది. కానీ అసలు కథ ఇక్కడే మొదలవుతోంది. ఎన్నికల సంఘం లోపలే ఇద్దరు కమిషనర్లు పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న నివేదికలు ఎందుకు వెలువడ్డాయి? కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫామ్ 6లో మార్పులపై సుప్రీంకోర్టు ఎందుకు ప్రశ్నలు లేవనెత్తింది? కోట్లాది పేర్ల తొలగింపుపై ఎందుకు అనుమానాలు పెరిగాయి? జ్ఞానేశ్ గతంలో కేంద్ర ప్రభుత్వంలో నిర్వహించిన కీలక బాధ్యతలు ఇప్పుడు ఎందుకు రాజకీయ చర్చగా మారాయి? బీజేపీతో సంబంధాలపై విపక్షాల ఆరోపణలకు ఆధారాలెంత? ఎన్నికల సంస్కరణల పేరుతో తీసుకున్న నిర్ణయాలు నిజంగా సంస్కరణలా.. లేక కొత్త వివాదాలకు బాటలా? ఒక వ్యక్తిపై వచ్చిన ఆరోపణల వెనుక, భారత ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతపై జరుగుతున్న అసలు పోరాటం ఏమిటి? తెరవెనుక ఏం జరిగింది?



3లో..

పైలట్‌కు ఆపరేషన్

స్కల్ ఫ్రాక్చర్ కావడంతో అత్యవసర శస్త్రచికిత్స



3లో..

వాట్ నెక్స్..!?
ఓటర్ల క్లెయిమ్‌లకు తెర

నేటితో ముగియనున్న సర్ గడువు



3లో..

ఆర్థిక ఒత్తిళ్ల వేళ జీఎస్టీ సంస్కరణలు

రేట్లకు బ్రేక్.. విధానాలపై కీలక దృష్టి



3లో..

కేటుగాళ్ల గుట్టురట్టు

తీగ లాగితే డొంక కదిలింది

100 మంది సైబర్ నేరగాళ్ల పట్టివేత

ఆ 45 ఎకరాల ఎక్కడ?

అధికారులను ప్రశ్నించిన సీఎం రేవంత్

అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కాలనీ • ఎర్రవల్లి భూములపై ముఖ్యమంత్రి ఆదేశాలు




సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల భూములపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రెండు గ్రామాల్లో చేపట్టిన సర్వే వివరాలను సీఎంకు వివరించారు. ఎర్రవల్లి పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు గత వివరాలు ఉండగా, తాజా రెవెన్యూ సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు తెలిపారు. దీంతో మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని సీఎం అధికారులను ఆదేశించారు. భూమి హద్దులు, రికార్డులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో ప్రత్యేక సర్వే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. (వివరాలు 2లో..)



చూపున్న కంటికి ఆపరేషన్?

తీవ్రంగా స్పందించిన హెచ్ఆర్సీ

ఒక కంటికి చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లిన మహిళకు మరో కంటికి ఆపరేషన్ జరిగిందన్న ఆరోపణ కలకలం రేపుతోంది. సిరిసిల్లకు చెందిన కొమ్ము వెంకమ్మకు ఎడమ కంటికి శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా, కుడి కంటికి ఆపరేషన్ చేశారన్న వార్తలపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. విషయం వెలుగులోకి రావడంతో రోగి భద్రత, వైద్య నిర్లక్ష్యం, శస్త్రచికిత్సకు ముందు సమ్మతి తీసుకున్నారా అనే ప్రశ్నలు ముందుకొచ్చాయి. బాధితురాలి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది? అసలు ఏ కంటికి ఆపరేషన్ చేయాల్సి వచ్చింది? ఏ కంటికి చేశారు? కుటుంబ సభ్యుల సమ్మతి తీసుకున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. పూర్తి వైద్య రికార్డులతో నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించింది. (వివరాలు 2లో..)



ఏడాదిలోనే ఇందిరమ్మ టవర్స్ సిద్ధం

480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు

పేదల సొంతింటి కలను వేగంగా నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను చేపడుతోందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలో ఇందిరమ్మ టవర్స్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు రాగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని మంత్రి చెప్పారు. వీరిలో బహిరంగ లక్కీ డ్రా ద్వారా 480 కుటుంబాలను ఎంపిక చేసి ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. (వివరాలు 2లో..)



బండికి బీజేపీ హైకమాండ్ బంపరాఫర్

ప్రచార కమిటీ పగ్గాలపై పార్టీ కసరత్తు

తెలంగాణలో పార్టీని మరింత దూకుడుగా ముందుకు తీసుకెళ్లేందుకు బీజేపీ అధిష్టానం కొత్త వ్యూహంపై దృష్టి పెట్టినట్లు సమాచారం. అధికార కాంగ్రెస్‌కు రాజకీయంగా గట్టి పోటీ ఇచ్చేలా కేడర్‌లో కొత్త ఉత్సాహం తీసుకురావడం లక్ష్యంగా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ బాధ్యతలు అప్పగించే అంశం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో బండి సంజయ్ పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున ఉద్యమాల వైపు నడిపించారు. ఆయన దూకుడు రాజకీయ శైలి బీజేపీకి గ్రామస్థాయి వరకు గుర్తింపు తీసుకురావడంలో కీలకంగా పనిచేసిందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉంది. (2లో..)



కేబీఆర్ పార్క్ ఫ్లైఓవర్ ప్రణాళికలో మార్పులు

జూబ్లీహిల్స్ నుంచి ముఫక్కం జా వరకు కొత్త మార్గం

హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేపట్టిన ఫ్లైఓవర్ ప్రాజెక్టులో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. (వివరాలు 2లో..)



27 లక్షల పిల్లలకు అల్పాహారం

విద్యార్థుల ఆరోగ్యం కోసం ఖర్చు

బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదన్న భట్టి

తెలంగాణలో 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఆరు రోజులు వేడి అల్పాహారం అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. (వివరాలు 2లో..)



పులిచింతల ప్రాజెక్టు మంత్రుల పరిశీలన

భట్టి, ఉత్తమ్ పర్యటనతో అధికారుల్లో కదలిక

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టును ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. (వివరాలు 2లో..)

ఆ 45 ఎకరాల ఎక్కడ?

- అధికారులను ప్రశ్నించిన సీఎం రేవంత్
- అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కాలనీ
- ఎర్రవల్లి భూములపై ముఖ్యమంత్రి ఆదేశాలు



సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల భూములపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రెండు గ్రామాల్లో చేపట్టిన సర్వే వివరాలను సీఎంకు వివరించారు. ఎర్రవల్లి పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు గత వివరాలు ఉండగా, తాజా రెవెన్యూ సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు తెలిపారు. దీంతో మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని సీఎం అధికారులను ఆదేశించారు. భూమి హద్దులు, రికార్డులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో ప్రత్యేక సర్వే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

కేసీఆర్ కుటుంబానికి రికార్డుల నోటీసులు

భూముల గుర్తింపు ప్రక్రియలో భాగంగా సర్వే పరిధిలోని భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సమర్పించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 325లోని భూమి వివరాలు పూర్తిగా తేలిన తర్వాత, అందులోని భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీంతో ఈ భూముల సర్వేకు ప్రాధాన్యం ఏర్పడింది. భూమి హక్కులు, సరిహద్దులు, రికార్డులపై స్పష్టత తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కాలనీ

ఇదే సర్వే నంబర్‌లో తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకోసం "తెలంగాణ అమరవీరుల కాలనీ" నిర్మించాలని సీఎం ఆదేశించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి సకల సౌకర్యాలతో కాలనీ ఏర్పాటు చేయాలని సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని ఆదేశించారు. జూన్ 2లోగా కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి గడువు విధించారు. దీంతో 45 ఎకరాల భూమి ఆచూకీ తేల్చడం, అర్హులైన రైతులకు భూముల పంపిణీ, అమరవీరుల కుటుంబాలకు పక్కా నివాస స్థలాల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి సారించనుంది.

చూపున్న కంటికి ఆపరేషన్?


తీవ్రంగా స్పందించిన హెచ్‌ఆర్సీ



సిరిసిల్లకు చెందిన కొమ్ము వెంకమ్మకు ఎడమ కంటికి చేయాల్సిన శస్త్రచికిత్సకు బదులుగా కుడి కంటికి ఆపరేషన్ చేశారన్న వార్తలపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఈ అంశాన్ని కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఆరోపణలు నిజమైతే ఇది వైద్య నిర్లక్ష్యం, రోగి భద్రత, శస్త్రచికిత్సకు ముందు తీసుకున్న సమ్మతి వంటి అంశాలపై తీవ్ర ఆందోళన కలిగించే విషయమని కమిషన్ పేర్కొంది. ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) నుంచి సమగ్ర నివేదిక కోరింది. రోగి వైద్య రికార్డులు, వైద్యులు సూచించిన శస్త్రచికిత్స, వాస్తవంగా నిర్వహించిన ఆపరేషన్ వివరాలు, రోగి లేదా కుటుంబ సభ్యుల నుంచి తీసుకున్న సమ్మతి వివరాలను నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది.

నవంబర్ 6న కమిషన్ ముందు విచారణ

వెంకమ్మ ప్రస్తుతం ఉన్న ఆరోగ్య పరిస్థితి, ఘటనపై ఇప్పటికే నిర్వహించిన విచారణ వివరాలను కూడా నివేదికలో సమర్పించాలని టీజీహెచ్ఆర్సీ స్పష్టం చేసింది. వైద్యపరమైన తప్పిదం జరిగిందా? శస్త్రచికిత్సకు సరైన సమ్మతి తీసుకున్నారా? అసలు ఏ కంటికి ఆపరేషన్ చేయాల్సి ఉంది? ఏ కంటికి నిర్వహించారు? అనే అంశాలపై స్పష్టత కోసం కమిషన్ ఈ వివరాలను కోరింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నివేదిక అందిన తర్వాతే ఘటనపై తదుపరి చర్యల దిశ స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఈ కేసును 2026 నవంబర్ 6న ఉదయం 11 గంటలకు నివేదిక కోసం విచారణకు ఉంచింది. దీంతో సిరిసిల్లలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఘటనపై అధికారిక విచారణకు మార్గం ఏర్పడింది.



కేబీఆర్ పార్క్ ఫ్లైఓవర్ ప్రణాళికలో మార్పులు

జూబ్లీహిల్స్ నుంచి ముఫక్కం జా వరకు కొత్త మార్గం

హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేపట్టిన ఫ్లైఓవర్ ప్రాజెక్టులో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముఫక్కం జా కళాశాల వరకు ఉక్కు వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మార్గం ముర్గ జంక్షన్ మీదుగా కొనసాగుతుంది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1కు అనుసంధాన మార్గం కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టును రెండు దశలుగా చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మాణ బాధ్యతలు చేపట్టిన మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థకే సవరించిన పనులను అప్పగించేందుకు అనుమతి ఇచ్చారు. అక్టోబర్ 6న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు నంబర్ 927 ద్వారా ఈ నిర్ణయాలకు అధికారిక ఆమోదం లభించింది.

టీవీ9, ఎన్ఎఫ్‌సీఎల్ పనులకు బ్రేక్

గతంలో ప్రతిపాదించిన టీవీ9 జంక్షన్, ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పనులకు కేఎన్ఆర్ నిర్మాణ సంస్థకు ఇచ్చిన పనుల అప్పగింత ఉత్తర్వులను కూడా ఉపసంహరించింది. టెండర్ సమయంలో ఆ సంస్థ చెల్లించిన డిపాజిట్లను తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. మొదటి దశలో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ప్రవేశ ద్వారం, ముర్గ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. తాజాగా ఆ పరిధిని మార్చి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముర్గ జంక్షన్ వరకు ఉక్కు వంతెన నిర్మాణానికే పరిమితం చేశారు. దీంతో కేబీఆర్ పార్క్ పరిసరాల్లో గతంలో ప్రతిపాదించిన పలు నిర్మాణాలకు బదులుగా కొత్త మార్గాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది.

రెండు దశల్లో నిర్మాణానికి కొత్త రూపకల్పన

మొదటి దశకు మంజూరైన ప్రాజెక్టు వ్యయం రూ.580 కోట్లు కాగా, సవరించిన ప్రారంభ అంచనా విలువ రూ.365.85 కోట్లుగా నిర్ణయించారు. రెండో దశలో గతంలో రోడ్ నంబర్ 45, ఫిల్మ్‌నగర్, మహారాజా అగ్రసేన్, క్యాన్సర్ ఆసుపత్రి జంక్షన్ల వద్ద పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. తాజాగా వాటి స్థానంలో ముర్గ జంక్షన్ నుంచి ముఫక్కం జా కళాశాల వరకు ఉక్కు వంతెన, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1కు అనుసంధాన మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండో దశకు మంజూరైన వ్యయం రూ.510 కోట్లు కాగా, సవరించిన ప్రారంభ అంచనా విలువ రూ.349.31 కోట్లుగా ఉంది.

జీహెచ్ఎంసీకి తదుపరి బాధ్యతలు

రెండు దశలకు సంబంధించిన సవరించిన ప్రతిపాదనలను ప్రాజెక్టుల ఆమోద కమిటీ ముందు ఉంచేందుకు జీహెచ్ఎంసీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇప్పటికే పనిచేస్తున్న ప్రాజెక్టు నిర్వహణ సలహాదారుల సేవలను కొనసాగించనుంది. అధికారిక అనుమతులు పూర్తికాకముందే సవరించిన రూపకల్పన ప్రకారం జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యలను ప్రభుత్వం తాజాగా ఆమోదించింది. ఇకపై అవసరమైన తదుపరి చర్యలను జీహెచ్ఎంసీ కమిషనర్ చేపట్టాలని ఆదేశించింది. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, కీలక ప్రాంతాల మధ్య రాకపోకలను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును ప్రభుత్వం కొత్త రూపంలో ముందుకు తీసుకెళ్తోంది.

ఏడాదిలోనే ఇందిరమ్మ టవర్స్ సిద్ధం

480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు



పేదల సొంతింటి కలను వేగంగా నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను చేపడుతోందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలో ఇందిరమ్మ టవర్స్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు రాగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని మంత్రి చెప్పారు. వీరిలో బహిరంగ లక్కీ డ్రా ద్వారా 480 కుటుంబాలను ఎంపిక చేసి ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

ముందుగా పూర్తి చేస్తే భారీ ప్రోత్సాహకాలు

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను ఏడాదిలోపు పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందించడమే లక్ష్యమని పొంగులేటి స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లకు ఏడాది గడువు విధించడంతోపాటు నిర్మాణాన్ని ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలలు ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. నాణ్యత విషయంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు కూడా నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్‌ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లో నిర్మాణాలు కొనసాగుతాయని వెల్లడించారు.

మరిన్ని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం

కుత్బుల్లాపూర్‌లో ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితోపాటు ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి పేదలకు ఇళ్లు నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. లబ్ధిదారుల కళ్ల ముందే నాణ్యమైన ఇళ్లు నిర్మించి, సొంతింటి సంతృప్తి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదల చిన్న కోరికలను నెరవేర్చడంతోపాటు సొంతింటి కలను హామీగా కాకుండా కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని పొంగులేటి పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్, కలెక్టర్ మను చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27 లక్షల పిల్లలకు అల్పాహారం

- విద్యార్థుల ఆరోగ్యం కోసం ఖర్చు
- బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదన్న భట్టి

తెలంగాణలో 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఆరు రోజులు వేడి అల్పాహారం అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందించే ఈ కార్యక్రమం పిల్లల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. సూర్యాపేట జిల్లా మునగాలలో రూ.9.60 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కిచెన్ ద్వారా 1,020కిపైగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని సుమారు 60 వేల మంది విద్యార్థులకు పౌష్టిక అల్పాహారం అందనుంది. సింగరేణి సంస్థ రూ.9.60 కోట్ల సహకారం అందిస్తుండగా, హరేకృష్ణమూవ్‌మెంట్ ఫౌండేషన్ అమలులో భాగస్వామిగా ఉంది.

బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదన్న భట్టి

సంక్షేమ పథకాలను ఉచితాలుగా చూడొద్దని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం, రైతులు, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెట్టుబడేనని పేర్కొన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్న నేపథ్యంలో "గతంలో పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు? ఇప్పుడు ఎందుకు రావాలనుకుంటున్నారో ప్రజలకు చెప్పాలి" అంటూ భట్టి ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, పేదల సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేయడానికేనా తిరిగి వచ్చేది అని విమర్శించారు. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. Uniindia

రూ.200 కోట్లతో ఆధునిక విద్యా ప్రాంగణాలు

గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రులు తెలిపారు. గడ్డిపల్లి పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని భట్టి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 105 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో ఇంగ్లిష్ మీడియం విద్య, వసతి, క్రీడా సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇదే సమయంలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించనున్నట్లు భట్టి ప్రకటించారు.



పులిచింతల ప్రాజెక్టుపై మంత్రుల పరిశీలన

భట్టి, ఉత్తమ్ పర్యటనతో అధికారుల్లో కదలిక

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టును ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ప్రాజెక్టు పరిధిలోని నీటి పరిస్థితులు, నిర్వహణ అంశాలను మంత్రులు పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. పులిచింతల ప్రాజెక్టు తెలంగాణలో సాగునీటి అవసరాలకు కీలకమైన నేపథ్యంలో మంత్రుల పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రాజెక్టు నిర్వహణ, నీటి వినియోగం, సంబంధిత అంశాలపై అధికారులతో మంత్రులు చర్చించారు. పర్యటన సందర్భంగా ప్రాజెక్టు వద్ద అధికారులు అవసరమైన వివరాలను మంత్రులకు అందించారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల హాజరు

మంత్రుల పులిచింతల పర్యటనలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ పాల్గొన్నారు. జెన్‌కో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజా ప్రతినిధుల అనుచరులు, నాయకులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాజెక్టు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రులు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పులిచింతల ప్రాజెక్టు నిర్వహణపై అధికారుల నుంచి పూర్తి సమాచారాన్ని తీసుకుని, అవసరమైన చర్యలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. నీటి వనరులు, నిర్వహణ అంశాలపై అధికార యంత్రాంగం మరింత దృష్టి సారించే అవకాశం ఉంది.


బండికి బీజేపీ హైకమాండ్ బంపరాఫర్

ప్రచార కమిటీ పగ్గాలపై పార్టీ కసరత్తు

తెలంగాణలో పార్టీని మరింత దూకుడుగా ముందుకు తీసుకెళ్లేందుకు బీజేపీ అధిష్ఠానం కొత్త వ్యూహంపై దృష్టి పెట్టినట్లు సమాచారం. అధికార కాంగ్రెస్‌కు రాజకీయంగా గట్టి పోటీ ఇచ్చేలా కేడర్‌లో కొత్త ఉత్సాహం తీసుకురావడం లక్ష్యంగా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ బాధ్యతలు అప్పగించే అంశం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో బండి సంజయ్ పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున ఉద్యమాల వైపు నడిపించారు. ఆయన దూకుడు రాజకీయ శైలి బీజేపీకి గ్రామస్థాయి వరకు గుర్తింపు తీసుకురావడంలో కీలకంగా పనిచేసిందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉంది. దీంతో రానున్న రాజకీయ కార్యాచరణలో ఆయనకు మరింత కీలక బాధ్యత అప్పగించాలనే ఆలోచన ముందుకు వచ్చినట్లు సమాచారం.

ప్రజా సంగ్రామ యాత్ర ఫార్ములా మళ్లీ?

2022లో బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర బీజేపీ రాజకీయ ప్రచారానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఐదు విడతలుగా సాగిన ఆ యాత్రలో సుమారు 57 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టి, దాదాపు 1,592 కిలోమీటర్ల మేర ప్రజలను కలిశారు. ఇప్పుడు అదే తరహాలో మరో భారీ పాదయాత్ర చేపట్టించే ప్రతిపాదనపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేయడం లక్ష్యంగా ఈ యాత్రను ఉపయోగించుకోవాలనే ఆలోచన ఉన్నట్లు సమాచారం. దసరా సందర్భంగా బండి సంజయ్‌కు కొత్త బాధ్యతలపై ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. అయితే దీనిపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



భారత్ పేరుతో ట్రంప్ తడబాటు



- జరగని ఎన్నికపై పిచ్చి ప్రేలాపనలు
- బ్రెజిల్ ఎన్నికను ఇండియాగా వర్ణన

అమెరికా ఎన్నికల వ్యవస్థపై మండిపడుతూ మాట్లాడిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. అదే విమర్శల్లో భారత్ పేరును ప్రస్తావించి అనూహ్యంగా చిక్కుల్లో పడ్డారు. భారత్‌లో జరిగినట్లే లేని 'అధ్యక్ష ఎన్నిక' గురించి 12.5 కోట్ల మంది ఓటు వేశారని, పోలింగ్ ముగిసిన వెంటనే ఫలితాలు వచ్చాయని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారాయి. ఎందుకంటే ఆయన చెప్పిన సంఖ్యలు, ఫలితాల వేగం భారత్‌కు కాకుండా బ్రెజిల్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికలకు అచ్చంగా సరిపోతున్నాయి. పోలింగ్ ముగిసిన వెంటనే ఫలితాల వెల్లడి ప్రారంభమైన బ్రెజిల్ ఎన్నికల వివరాలను ట్రంప్ భారత్ పేరుతో ప్రస్తావించినట్లు కనిపిస్తోంది. అంతేకాదు.. భారత్‌లో ప్రజలు రాష్ట్రపతిని నేరుగా ఎన్నుకోరనే ప్రాథమిక వాస్తవం కూడా ఈ వ్యవహారాన్ని మరింత ఆసక్తికరంగా మార్చింది. పోస్టును తరువాత సరిచేసినా, అప్పటికే ప్రశ్నలు మొదలయ్యాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేస్తూ భారత్ పేరును ప్రస్తావించడం తీవ్ర చర్చకు దారితీసింది. అక్టోబర్ 4న ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో భారత్‌లో అధ్యక్ష ఎన్నికలు జరిగాయని, 12.5 కోట్ల మంది ఓటు వేశారని పేర్కొన్నారు. ఓటింగ్ ముగిసిన వెంటనే అదే రోజు ఫలితాలు వెలువడ్డాయని తెలిపారు. అమెరికాలో మాత్రం తక్కువ సంఖ్యలో ఓట్లు ఉన్న నగరాలు, రాష్ట్రాల్లో ఫలితాలు వెలువడేందుకు వారాలు పడుతున్నాయని విమర్శించారు. అమెరికా ఎన్నికల ప్రక్రియ అవినీతిమయంగా ఉందంటూ ఆరోపించారు.

అసలు ప్రస్తావన బ్రెజిల్ ఎన్నికలే..!

ట్రంప్ పోస్టులోని వివరాలు భారత్‌కు కాకుండా బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలకు సరిపోతున్నట్లు స్పష్టమైంది. బ్రెజిల్‌లో ఆదివారం జరిగిన తొలి విడత ఎన్నికల్లో 125.27 మిలియన్ల చెల్లుబాటు అయ్యే ఓట్లు నమోదయ్యాయి. పోలింగ్ ముగిసిన సాయంత్రం 5 గంటల నుంచే ఫలితాలు విడుదల కావడం ప్రారంభమైంది. అధ్యక్ష పదవికి లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా, జైర్ బోల్సొనారో కుమారుడు ఫ్లావియో బోల్సొనారో పోటీపడ్డారు. ఎవరికీ మెజారిటీ రాకపోవడంతో అక్టోబర్ 25న రెండో విడత ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ భారత్ పేరును ప్రస్తావించడం తప్పిదంగా కనిపించింది. పోస్టును తరువాత సరిచేశారు.

భారత్‌లో అధ్యక్షుడిని ప్రజలు ఎన్నుకోరు

భారత్‌లో 2026లో ఎలాంటి అధ్యక్ష ఎన్నిక జరగలేదు. ద్రౌపది ముర్ము ప్రస్తుతం రాష్ట్రపతిగా కొనసాగుతున్నారు. భారత రాష్ట్రపతిని ప్రజలు నేరుగా ఎన్నుకోరు. పార్లమెంట్ రెండు సభల్లోని ఎన్నికైన సభ్యులు, రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లోని ఎన్నికైన సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ రాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. సాధారణ ఎన్నికల్లో ప్రజలు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల సభ్యులను ఎన్నుకుంటారు. అనంతరం లోక్‌సభలో మెజారిటీ సాధించిన పార్టీ లేదా కూటమి నేత ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపడతారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారత్‌లో దాదాపు 98 కోట్ల మంది సమోదిత ఓటర్లు ఉన్నారు.

ఓటర్ ఐడీపై గతంలోనూ ట్రంప్ ప్రస్తావన

భారత్ ఎన్నికల విధానాన్ని ట్రంప్ గతంలోనూ అమెరికా ఎన్నికల సంస్కరణలకోసం ప్రస్తావించారు. ఆగస్టులో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అమెరికా అధికారులను సంప్రదించి, చెల్లుబాటు అయ్యే ఫొటో ఐడీ లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌లో జరిగిన గత ఎన్నికల్లో 64.6 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారని, ఒక శాతానికి లోపే పోస్టల్ బ్యాలెట్ వినియోగించారని ఆయన చెప్పారు. ప్రతి ఓటరికి చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు పత్రం ఉన్నట్లు పేర్కొంటూ సేమ్ అమెరికా యాక్ట్‌కు మద్దతు కోరారు. తాజా వ్యాఖ్యల్లో భారత్ పేరుతో జరిగిన ఈ పొరపాటు మాత్రం ట్రంప్ ఎన్నికల వాదనలను మరోసారి చర్చలోకి తెచ్చింది.

వాట్ నెక్ట్స్ ?

- ఓటర్ల క్లెయిమ్‌లకు తెర
- నేటితో ముగియనున్న సర్ గడువు

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)లో కీలక దశ బుధవారం, అక్టోబర్ 7తో ముగియనుంది. ముసాయిదా జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు ఇదే చివరి అవకాశం. కొత్త ఓటర్లు ఫామ్6, వివరాల సవరణకు ఫామ్8, అనర్హుల పేర్లపై అభ్యంతరాలకు ఫామ్7 సమర్పించవచ్చు. ఆగస్టు 17న విడుదలైన ముసాయిదా జాబితాలో 73.39 లక్షల మంది ఓటర్లు పోగా.. వాటిపై ఏడున్నర లక్షలకు పైగా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు వచ్చాయి. అలా వచ్చిన వాటిలో మెజార్టీ గ్రేటర్ పరిధిలోనే ఉండటం విశేషం. వీరికి సంబంధించి పెద్ద సంఖ్యలో నోటీసులు జారీ చేసి విచారణ కొనసాగుతోంది. సెప్టెంబర్ చివరి నాటికి లక్షలాది కేసుల్లో విచారణ పూర్తయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



తర్వాత నోటీసులు.. విచారణలు కీలకం

క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు ముగిసినా సర్ ప్రక్రియ పూర్తికాదు. నవంబర్ 5 వరకు నోటీసులు, విచారణలు, క్లెయిమ్‌ల పరిష్కారం కొనసాగనుంది. నవంబర్ 9న తుది ఓటరు జాబితా విడుదల కానుంది. మ్యాపింగ్‌లో సమస్యలు ఉన్నవారు, రికార్డుల్లో అసమానతలు ఉన్నవారి ఇళ్లకు బూత్ స్థాయి అధికారులు వెళ్లి అవసరమైన పత్రాలు సేకరిస్తున్నారు. ఎన్నికల నమోదు అధికారులు వాటిని పరిశీలించి ఓటు అర్హతపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ దశలో పేర్లు గల్లంతయ్యే అవకాశం ఉందంటూ కాంగ్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్ లక్షలాది ఓటర్ల హక్కులకు ముప్పు ఉందని ఆరోపించారు.

ముస్లిం ఓట్లపై ఒవైసీ కొత్త ఆరోపణలు

ఇదే సమయంలో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ముస్లిం ఓటర్ల పేర్ల తొలగింపునకు ఫామ్ 7ను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ గోషామహల్‌లో ప్రీప్రింటెడ్ ఫామ్7ల ద్వారా 122 మంది ఓటర్ల పేర్లు తొలగించేందుకు ప్రయత్నం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే సంబంధిత బీఎల్ఓ ఆ దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడైంది. ప్రతి ఫామ్7ను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పుడు దరఖాస్తులు సమర్పించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఒవైసీ ఎన్నికల సంఘాన్ని కోరారు. తెలంగాణ సీఈవో కూడా తప్పుడు సమాచారం ఇచ్చి ఓటర్ల పేర్లు తొలగించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దీంతో అక్టోబర్ 7 తర్వాత సర్‌లో అసలు పరీక్ష మొదలుకానుంది.

ప్రాణాలు కాపాడిన పైలట్‌కు తీవ్ర గాయం



- స్కల్ ఫ్రాక్చర్ కావడంతో అత్యవసర శస్త్రచికిత్స

టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని ప్రమాదం నుంచి కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. విమాన కాక్‌పిట్‌లో ఒమన్‌కు చెందిన కోపైలట్ క్రాష్ యాక్స్‌తో దాడి చేయడంతో ఆయన తలకు తీవ్రమైన గాయం అయింది. స్కల్ ఫ్రాక్చర్ కావడంతో అత్యవసర శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. దాడిలో రక్తస్రావం జరిగినా స్మిత్ మచ్చర్ ధైర్యం కోల్పోలేదు. కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు చివరి శక్తి వరకు ప్రయత్నించారు. తలుపు తెరుచుకున్న వెంటనే సిబ్బంది, ప్రయాణికులు లోపలికి వెళ్లి కోపైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో విమానంలో 170 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు.

సౌదీలో ఆపరేషన్.. తలకు పునర్నిర్మాణం

విమానాన్ని అత్యవసరంగా సౌదీ అరేబియాలోని టబుక్ ప్రిన్స్ సుల్తాన్ బిన్ అబ్దులజీజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దించారు. స్మిత్ మచ్చర్‌కు తలపై ఏర్పడిన డిప్రెస్డ్ ఫ్రాక్చర్‌కు అక్కడి వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. పుర్రెలోకి లోపలికి నొక్కుకుపోయిన ఎముక భాగాన్ని సరిచేసేందుకు శస్త్రచికిత్స నిర్వహించారు. చేతులు, ఛాతీ, పొత్తికడుపు పైభాగంలోనూ గాయాలయ్యాయి. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను అబుదాబికి తరలించారు. ప్రస్తుతం సైనిక ఆసుపత్రిలో నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని వైద్య వర్గాలు తెలిపాయి.

170 మందికిపైగా ప్రాణాలు కాపాడిన సాహసం

దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న FZ1073 విమానం ప్రయాణంలో దాదాపు 18 వేల అడుగుల మేర ఒక్కసారిగా కిందికి పడిపోయింది. తొలుత అత్యవసర సంకేతం పంపిన విమానం తర్వాత హైజాకింగ్‌ను సూచించే స్క్వాక్ 7500 కోడ్ ప్రసారం చేసింది. కోపైలట్ దాడి చేసినా స్మిత్ మచ్చర్ విమానాన్ని కాపాడేందుకు పోరాడారు. ప్రధాని మోదీతో వీడియో కాల్‌లో ఆయన తన ప్రాణాల కంటే ప్రయాణికుల భద్రతకే ప్రాధాన్యం ఇచ్చానని వివరించారు. "నేను చనిపోవచ్చు.. కానీ ఇతరులు చనిపోకూడదు" అన్న ఆయన పోరాటం విమానంలోని వందలాది ప్రాణాలను కాపాడిన కీలక ఘట్టంగా నిలిచింది.

మోదీ, షా, భాగవత్ తప్పించుకోలేరు

- ఓటు చోరీ ఆరోపణలపై రాహుల్ రణభేరి
- 300 ఎంపీలతో ఈసీ భేటీకి విపక్షాల డిమాండ్

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన మంగళవారం ఉత్కంఠకు దారితీసింది. పార్లమెంట్ మకర ద్వార్ నుంచి ఇండియా కూటమి ఎంపీలు ఉదయం 11 గంటల సమయంలో "సేవ్ డెమోక్రసీ" నినాదాలతో నిర్వాచన్ సదన్ వైపు మార్చ్ ప్రారంభించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్ వద్ద పోలీసు అంక్షలను ఎదుర్కొన్నారు.



మోదీ, షా, భాగవత్‌పై రాహుల్ ఆరోపణలు

ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో పోలీసులతో ప్రతిష్ఠంభన మధ్య మాట్లాడిన రాహుల్ గాంధీ.. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ జ్ఞానేశ్ కుమార్ సహకారంతో "ఓటు చోరీ" చేశారని ఆరోపించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని, ఈ వ్యవహారాన్ని "దేశద్రోహం"గా అభివర్ణించారు. "ఎవరూ తప్పించుకోలేరు.. చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. 300 మందికి పైగా లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు వచ్చారని చెప్పారు.

50 మీటర్ల దూరంలోనే అడ్డుకున్న పోలీసులు

ఎన్నికల సంఘం కార్యాలయం తమకు కేవలం 50 మీటర్ల దూరంలో ఉన్నా వెళ్లేందుకు అనుమతించలేదని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు ఎన్నికల సంఘాన్ని కలవలేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమేంటని ప్రశ్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో రాహుల్ ఓ బారికేడ్‌పైకి ఎక్కి జాతీయ జెండాను ఊపారు. ఆ తర్వాత రాహుల్, ప్రియాంక సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోనే సిట్-ఇన్ ప్రారంభించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరిక్ ఓబ్రెయిన్ సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

తొమ్మిది గంటల తర్వాత అదుపులోకి

దాదాపు తొమ్మిది గంటల పాటు కొనసాగిన నిరసన అనంతరం రాత్రి 8 గంటల సమయంలో ఢిల్లీ పోలీసులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు రాహుల్‌ను బలవంతంగా బస్సులోకి తీసుకెళ్లిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. వారిని ఉత్తర ఢిల్లీలోని కింగ్స్‌వే క్యాంప్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇదే రోజు మధ్యాహ్నం కూడా గాంధీ సోదరసోదరీమణులను కొద్దిసేపు పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం విడుదల చేశారు. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం నుంచి ఒక అధికారి వచ్చి ఒకటి రెండు రోజుల్లో భేటీకి హామీ ఇస్తే నిరసన విరమించేందుకు రాహుల్ సిద్ధంగా ఉన్నారని, అయితే 300 మంది ఎంపీలతో కలిసి సమావేశం నిర్వహించాలన్నది ఆయన పరతని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

నవంబర్ వరకు పోరాటం

జ్ఞానేశ్ కుమార్‌పై పోరాటాన్ని పార్లమెంట్ శీతాకాల సమావేశాల వరకు కొనసాగించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అక్టోబర్ 10 నుంచి 20 వరకు "ఓటు కాపాడండి.. దేశాన్ని కాపాడండి" పేరుతో బ్లాక్ స్థాయిలో సైకిల్, బైక్ ర్యాలీలు నిర్వహించనుంది. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25 వరకు బూత్ స్థాయిలో చౌపాల్స్ నిర్వహించనుంది. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ సభ, నవంబర్ 25, 26 తేదీల్లో ఆరు ప్రాంతాల నుంచి "చలో ఢిల్లీ" మార్చ్‌లు చేపట్టనుంది. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అవన్నీ ఢిల్లీలో కలవనున్నాయి.



అభిశంసన దిశగా కాంగ్రెస్ అడుగులు

శీతాకాల సమావేశాల్లో ఎన్నికల సంఘం వ్యవహారాన్ని ప్రధాన అంశంగా లేవనెత్తి ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై అభిశంసన తీర్మానం తీసుకురావాలని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ మంగళవారం నాటి ఇండియా కూటమి మార్చ్‌కు దూరంగా ఉన్నాయి. మరోవైపు ఎన్నికల సంఘానికి సంబంధించిన కేసును సుప్రీంకోర్టు విచారిస్తోంది. జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల నిర్ణయాలు ఏకగ్రీవంగా లేకపోతే వాటిపై నిలుపుదల అవకాశం ఉంటుందని కోర్టు పేర్కొన్నప్పటికీ, జ్ఞానేశ్ కుమార్‌పై తక్షణ చర్యకు మాత్రం నిరాకరించింది. ఇలా రాజకీయ నిరసన, పోలీసు చర్యలు, న్యాయపరమైన పరిణామాలు ఒకేసారి ముడిపడటంతో ఈ వ్యవహారం మరింత కీలక దశకు చేరింది.

కేటుగాళ్ల గుట్టురట్టు

- తీగ లాగితే డొంక కదిలింది
- 100 మంది సైబర్ నేరగాళ్ల పట్టివేత

ఒక డాక్టర్‌ను డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించి రూ.11 కోట్లు కొల్లగొట్టిన కేసు.. దర్యాప్తు సాగుతున్న కొద్దీ మరో భారీ సైబర్ నేరాల నెట్‌వర్క్‌ను బయటకు లాగింది. ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు డబ్బు మళ్లింపు వెనుక ఉన్న మ్యూల్ అకౌంట్లను అధికారులు పరిశీలించడంతో అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తీగ లాగితే డొంక కదిలినట్లుగా.. దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించిన సైబర్ మోసాల వ్యవస్థ బయటపడింది. దీంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఏకకాలంలో భారీ ఆపరేషన్ చేపట్టారు.

ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో వేట

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళలో అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న 100 మందికిపైగా ఏజెంట్లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అమాయకుల వివరాలతో నకిలీ బ్యాంకు ఖాతాలు తెరవడం, వారి కేవైసీ పత్రాలను సేకరించడం, ఆ వివరాలను సైబర్ నేరగాళ్లకు చేరవేయడం ఈ నెట్‌వర్క్ ప్రధాన కార్యకలాపాలుగా గుర్తించారు. నిందితుల నుంచి పెద్ద సంఖ్యలో డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నమోదైన పలు సైబర్ మోసాలతో ఈ నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.



దుబాయ్ లింకులతో దర్యాప్తు వేగం

హైదరాబాద్ డాక్టర్ కేసులో దోచుకున్న నగదు పలు మ్యూల్ ఖాతాలకు చేరినట్లు అధికారులు గుర్తించారు. పట్టుబడిన ఏజెంట్లకు దుబాయ్ సహా ఇతర దేశాల్లో ఉన్న అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లతో సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు లభించాయి. అరెస్టైన నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ఏజెంట్లను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. ఒక్క మోసం వెనుక ఇంత పెద్ద వ్యవస్థ బయటపడటంతో సైబర్ నేరాలపై నిఘా యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

విశాఖ.. భారత
సముద్ర శక్తి కేంద్రం

- సూర్యతో కొత్త శక్తి.. రాజ్‌నాథ్ కీలక వ్యాఖ్యలు

విశాఖపట్నం వేదికగా భారత రక్షణ రంగంలో మరో కీలక అధ్యాయం మొదలైంది. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో దేశంలోనే తొలి స్వదేశీ ఫ్లీట్ సపోర్ట్ షిప్ 'ఐఎన్ఎస్ సూర్య'ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం ప్రారంభించారు. అదే కార్యక్రమంలో ఐదో ఫ్లీట్ సపోర్ట్ షిప్ ఎఫ్ఎస్ఎస్-5కు కీల్ వేశారు. అప్‌గ్రేడ్ చేసిన స్లిప్‌వే-4, 300 టన్నుల గోలియత్ క్రేన్‌ను కూడా ప్రారంభించారు. ఈ మూడు కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఎస్-1 ప్రారంభం సాధించిన విజయానికి ప్రతీక, ఎఫ్ఎస్ఎస్-5 కీల్ వేయడం సంకల్పానికి ప్రతీక, కొత్త స్లిప్‌వే పెరుగుతున్న సామర్థ్యానికి ప్రతీక అని వివరించారు. 43,500 టన్నుల సామర్థ్యం కలిగిన ఫ్లీట్ సపోర్ట్ షిప్‌లు సముద్రంలో ఉన్న యుద్ధ నౌకలకు ఇంధనం, ఇతర అవసరాలను అందిస్తూ నౌకాదళం ఎక్కువకాలం దూర ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించేందుకు సహకరిస్తాయి.

విశాఖకు ప్రపంచస్థాయి హబ్ హోదా

విశాఖపట్నాన్ని ప్రపంచంలోని ప్రముఖ మారిటైమ్ ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఈ నగరంలో తూర్పు నౌకాదళ కమాండ్, నేవల్ డాక్‌యార్డ్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, విశాఖ పోర్టు వంటి కీలక వ్యవస్థలు ఉన్నాయని గుర్తుచేశారు. వీటితో పాటు ఏపీకి చెందిన ఎంఎస్ఎంఈలు, విశ్వవిద్యాలయాలు, టెక్నాలజీ సంస్థలు, స్టార్టప్‌లను అనుసంధానం చేసి సమగ్ర నౌకా నిర్మాణ వ్యవస్థను రూపొందించాలని సూచించారు. స్వావలంబన ఒక కీలక మైలురాయి మాత్రమే.. ప్రపంచ స్థాయి పోటీతత్వమే తదుపరి లక్ష్యం అని ఆయన అన్నారు. నాణ్యత, ఉత్పాదకత, సాంకేతికత, ఖర్చు, సమయపాలన విషయంలో భారత షిప్‌యార్డులు ప్రపంచస్థాయిలో నిలవాలని పిలుపునిచ్చారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ దేశ సముద్ర సామర్థ్యానికి సంరక్షకంగా పనిచేస్తోందని పేర్కొంటూ, ఇకపై "మెరుగ్గా డిజైన్ చేయాలి.. వేగంగా నిర్మించాలి.. సమయానికి అందించాలి" అనే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. భారత నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తొలి స్పందనదళంగా, విశ్వసనీయ భద్రతా భాగస్వామిగా వ్యవహరిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. మానవతా సహాయం, విపత్తు నిర్వహణ, సముద్ర దోపిడీ నిరోధం, తరలింపు చర్యలు, సముద్ర భద్రతలో నౌకాదళం తన సామర్థ్యాన్ని చాటుతోందని వివరించారు.

ఆర్థిక ఒత్తిళ్ల వేళ జీఎస్టీ సంస్కరణలు

- రేట్లకు బ్రేక్.. విధానాలపై కీలక దృష్టి

ఆర్థిక ఒత్తిళ్లు, వ్యాపార రంగంలో అనిశ్చితి కొనసాగుతున్న వేళ అక్టోబర్ 8 రేపు జరిగే 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంపై ఆసక్తి పెరిగింది. ఈ భేటీలో జీఎస్టీ రేట్లలో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రెండు రేట్ల విధానం కొనసాగింపుతో పాటు రిజిస్ట్రేషన్, రిఫండ్లు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, పన్ను అమలు విధానాల్లో సంస్కరణలపై ప్రధానంగా చర్చ జరగనుంది. భవిష్యత్తులో జీఎస్టీ రేట్లను ఏడాదికి ఒక్కసారి మాత్రమే మార్చి, ఏప్రిల్ 1 నుంచి అమలు చేసే విధానాన్ని పరిశీలించే అవకాశం ఉంది. అక్టోబర్ నుంచి జూలై వరకు పన్ను పరిధిలోని సరఫరాలు 25.8 శాతం పెరగడం, స్థూల పన్ను బాధ్యత 13.6 శాతం పెరగడం రేట్ల స్థిరత్వానికి అనుకూలంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



రిఫండ్లు, క్రెడిట్‌పై కొత్త విధానం

వ్యాపారులకు నేరుగా ప్రభావం చూపే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనల్లో మార్పులు ప్రతిపాదించారు. సరైన ఇన్వాయిస్ ఉండి, వస్తువులు అందుకుని, సరఫరాదారుకు పన్నుతో సహా పూర్తి చెల్లింపు చేసిన కొనుగోలుదారుడు.. సరఫరా గొలుసులో తరువాతి దశలో తప్పిదం జరిగినా క్రెడిట్ కొనసాగించుకునే అవకాశం కల్పించనున్నారు. రిఫండ్ ప్రక్రియను వేగవంతం చేయడం మరో కీలక ప్రతిపాదన. ప్రస్తుతం సగటున 25 రోజులు పడుతున్న రిఫండ్ ప్రక్రియలో 10 రోజుల్లోనే అంగీకారం, రిస్క్ తనిఖీ తర్వాత 90 శాతం అర్హత కలిగిన మొత్తాన్ని విడుదల చేసే విధానం పరిశీలనలో ఉంది. కస్టమ్స్, బ్యాంకింగ్ వ్యవస్థల నుంచి సమాచారం ఆటోమేటిక్‌గా తీసుకునేలా సాంకేతిక మార్పులు చేయనున్నారు. సేవలు, ప్లాంట్, యంత్రాలపై చెల్లించిన పన్నుకు కూడా రిఫండ్ అర్హతను విస్తరించే ప్రతిపాదన ఉంది.

చిన్న వ్యాపారాలకు మరింత సులభత

జీఎస్టీ రిజిస్ట్రేషన్, సవరణలను మరింతగా ఆటోమేషన్ చేయడం కూడా సమావేశం అజెండాలో ఉంది. ప్రస్తుతం 61 శాతం రిజిస్ట్రేషన్లు అధికారుల జోక్యం లేకుండానే మూడు పని దినాల్లో పూర్తవుతున్నాయి. చిన్న వ్యాపారాలు రాష్ట్ర సరిహద్దులు దాటి ఈకామర్స్ ద్వారా విక్రయాలు చేయడాన్ని సులభతరం చేసే మార్పులు కూడా ప్రతిపాదించారు. ఎగుమతిదారులకు ఊరట కల్పించే చర్యల్లో భాగంగా విదేశీ క్లయింట్లకు సేవలు అందించే సంస్థలకు కొన్ని నిబంధనలను సరళీకరించనున్నారు. మరోవైపు జీఎస్టీ ఉల్లంఘనలపై జైలు శిక్షకు బదులుగా పన్ను వసూలు, వడ్డీ, తగిన జరిమానాలకు ప్రాధాన్యం ఇచ్చే విధానం పరిశీలనలో ఉంది. ఆలస్యం, అనుకోకుండా జరిగిన తప్పిదాలు, చెల్లింపుల లోపాలను నేరాలుగా పరిగణించే పరిధిని తగ్గించాలన్నది ప్రతిపాదన. రాష్ట్రాలతో సంప్రదింపుల అనంతరం రూపొందించిన ఈ సంస్కరణలను కౌన్సిల్ ఆమోదిస్తే 2027 వరకు దశలవారీగా అమలు చేసే అవకాశం ఉంది.

జలజీవన్ సభకు జనం జేజేలు



ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్-2.0 'అమరజీవి జలధార' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీ మాధవ్ హాజరైన సభకు సుమారు 70 వేల మంది స్వచ్ఛందంగా తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. ప్రొద్దుటూరు అభివృద్ధికి సంబంధించిన కూరగాయల మార్కెట్, 100 అడుగుల రహదారుల విస్తరణ, పాలిటెక్నిక్, వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సభ విజయవంతానికి సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్తియార్ మాట్లాడుతూ, 'అమరజీవి జలధార' కార్యక్రమం రాయలసీమకు తలమానికమన్నారు. సభపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చేసిన విమర్శలను ఖండించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు.

చెత్త వేస్తే కెమెరాకు చిక్కాల్సిందే



ప్రొద్దుటూరు పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై నిఘాను మరింత కట్టుదిట్టం చేసేందుకు సీసీ కెమెరాలు, క్యూ ఆర్ కోడ్ విధానాన్ని అమలు చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. 52 వార్డుల్లో ఇంటింటి తడి, పొడి చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణను సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించనున్నారు. మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏఎస్పీ విభూకృష్ణ పోలీసుశాఖ నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. పారిశుధ్య సిబ్బంది విధులకు హాజరయ్యే సమయం, రాక, వాహన నంబర్లను క్యూ ఆర్ కోడ్ ద్వారా నమోదు చేయనున్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేవారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి చర్యలు తీసుకునేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. పట్టణంలో ఇప్పటికే 120 కెమెరాలు ఉండగా, అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని ఏర్పాటు చేయనున్నారు. నేరాల నియంత్రణతో పాటు పారిశుధ్య పర్యవేక్షణకు వాటిని వినియోగించనున్నారు. ప్రతిరోజూ 100 శాతం పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా మున్సిపల్, పోలీసు శాఖలు సమన్వయంతో ఈ విధానాన్ని అమలు చేయనున్నాయి.

వీఐపీలు వెళ్లగానే మళ్లీ చెత్తకుప్పలు



ప్రొద్దుటూరు కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని అమృతనగర్ లో చెత్త సమస్యపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రాంతాన్ని శుభ్రం చేసిన అధికారులు, పర్యటన ముగిసిన కొద్ది సేపటికే నివాసాల సమీపంలో మళ్లీ చెత్త తరలించేందుకు ప్రయత్నించారని స్థానికులు ఆరోపించారు. చెత్తను పేరబెట్టి నిప్పంటించడంతో 24 గంటల పాటు దట్టమైన పొగ కమ్ముకుంటోందని, అమృతనగర్ తో పాటు కానపల్లె, మదూరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు శ్వాస సమస్యలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా చెత్తను తరలించి కాల్చడమే చేస్తున్నారని మండిపడ్డారు. అమృతనగర్ ను డంపింగ్ యార్డుగా మార్చవద్దంటూ గ్రామస్థులు టెంట్ ఏర్పాటు చేసి నిరసన దీక్ష చేపట్టారు. చెత్త తరలింపును అడ్డుకుని, పరిష్కారం లభించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, డీఎల్ పీవో, డీపీవోలు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీరయోధుడి త్యాగాలకు ఘన నివాళులు




వేంపల్లెలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న వర్ధంతిని వడ్డెర కుల బంధువులు ఘనంగా నిర్వహించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యంలో సైన్యాధ్యక్షుడిగా పనిచేసిన ఓబన్న చిత్రపటానికి నాలుగు రోడ్ల కూడలి సమీపంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటిష్ పాలకుల చేతిలో వీరమరణం పొందిన ఓబన్న వడ్డెర సమాజానికి ఆరాధ్యుడని, ఆయన ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగం నేటి తరంతో పాటు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. పార్టీల కతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాచవీటి పవన్ కుమార్, డాక్టర్ యోగీశ్వర్, గంగరాజు, బాలాజీ, సుధాకర్, బ్రహ్మయ్య, సంటెన్న, మల్లికార్జున, రామచంద్ర అలియాస్ ధోనీ, కులాయప్ప, తేజతో పాటు పలువురు వడ్డెర కుల బంధువులు పాల్గొన్నారు. ఓబన్న వీరత్వాన్ని ప్రతి తరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఆయన త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, ధైర్యసాహసాల స్ఫూర్తిని యువతలో పెంపొందించాలని పిలుపునిచ్చారు.

క్యాన్సర్ ముందస్తు గుర్తింపే లక్ష్యం



సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బసవతారకం క్యాన్సర్ స్క్రీనింగ్, వైద్య శిబిరం ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఇన్ చార్జ్ బీటెక్ రవి బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులను కలిసి నిర్వహిస్తున్న క్యాన్సర్ పరీక్షలు, అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వేంపల్లె టీడీపీ ఇన్ చార్జ్ అజ్జగుట్టు రఘునాథరెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ క్లస్టర్ ఇన్ చార్జ్ మారెడ్డి భరత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పుప్పాల శ్రీధర్ రెడ్డి తదితరులు శిబిరాన్ని సందర్శించి సేవలను పరిశీలించారు. క్యాన్సర్ ను తొలిదశలో గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు మెరుగుపడతాయని బీటెక్ రవి తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

అమరావతి పనుల వేగం పెంచండి



నెలకు రూ.2 వేల కోట్ల పనులే లక్ష్యం నిర్మాణ సంస్థలతో చంద్రబాబు సమీక్ష



అమరావతి రాజధాని నిర్మాణ పనులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను, నిర్మాణ సంస్థలను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో రాజధాని పనులపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు మంత్రి పి.నారాయణ వివరించారు. గత నెలలో రూ.1,345 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఇకపై ప్రతి నెల రూ.2 వేల కోట్ల పనులు జరిగేలా స్పష్టమైన ప్రణాళికతో పనిచేయాలని సీఎం సూచించారు. ఓఆర్ ఆర్ ప్రాజెక్టుకు ప్రాధాన్యంరాజధాని నిర్మాణంతో పాటు అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం పెంచుకోవాలని సూచించారు. రాజధాని పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నాణ్యతతో, నిర్ణీత వేగంతో నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సచివాలయ టవర్లు, అసెంబ్లీ భవనం వంటి ఐకానిక్ నిర్మాణాల్లో జాప్యం ఉండకూడదని పేర్కొన్నారు. అమరావతి ఓఆర్ ఆర్‌కు సంబంధించి ఎన్ హెచ్ ఏఐ ఇప్పటికే టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. నైపుణ్యాలతో నిర్మాణ రంగానికి బలంరాజధాని నిర్మాణం పెద్ద స్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో కార్మికులకు ఆధునిక నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ తరహాలో శిక్షణ అందించే విధానంపై దృష్టి పెట్టాలని సూచించారు. నిర్మాణ సంస్థలు సమన్వయంతో పనిచేస్తే పనుల వేగం పెరగడంతో పాటు నాణ్యత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. రాజధాని మౌలిక వసతుల నిర్మాణంలో సమయం, నాణ్యత రెండింటినీ కీలక ప్రమాణాలుగా తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



కుక్క మొరగడంతో గొడవ.. కాపరిపై దాడి

ప్రొద్దుటూరు మండలం చౌదూరు గ్రామ సమీపంలోని పెన్నానది తీరంలో కుక్క గొర్రెలపై మొరిగిన వ్యవహారం తీవ్ర ఘర్షణకు దారితీసింది. గొర్రెల కాపరి రాజశేఖర్‌పై కొడవలితో దాడి జరిగినట్లు సమాచారం. గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, రాజశేఖర్ పెన్నా తీరంలో పశువులు, గొర్రెలను మేపుతుండగా సుబ్బారెడ్డికి చెందిన కుక్క రాజశేఖర్ గొర్రెలపై మొరిగింది. దీంతో రాజశేఖర్ కుక్కను మందలించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో సుబ్బారెడ్డి తన స్నేహితుడు కిరణ్ రెడ్డితో కలిసి తనపై కొడవలితో దాడి చేసినట్లు రాజశేఖర్ ఆరోపించాడు. దాడిలో గాయపడిన అతడిని స్థానికులు వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించారు. ఘటనపై ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. చిన్న విషయంగా మొదలైన వివాదం దాడికి దారితీయడంతో స్థానికంగా కలకలం రేగింది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

విశాఖ ఉక్కు కార్మికులకు బోనస్ వెంటనే చెల్లించాలి

విశాఖ ఉక్కు కార్మికులకు సెయిల్‌లో చెల్లిస్తున్న బోనస్‌ను తక్షణమే అమలు చేయాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. మూడు దశాబ్దాలుగా ఎన్‌జేసీఎస్ ద్వారా ప్రకటించే బోనస్ విశాఖ ఉక్కులో అమలవుతుండగా, గత రెండేళ్లుగా యాజమాన్యం వైఖరి, గుర్తింపు యూనియన్ అసమర్థత కారణంగా కార్మికులు బోనస్ కోల్పోయారని అయోధ్యరామ్ విమర్శించారు. ఎన్‌జేసీఎస్‌లో విశాఖ ఉక్కు భాగస్వామి అయినందున, అక్కడ కుదిరిన ఒప్పందాలను ఇక్కడా అమలు చేయాలని కోరారు. స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు యు. రామస్వామి మాట్లాడుతూ, శాశ్వత ఉన్నత యాజమాన్యం నియామకంతో కొంత ఉపశమనం కలిగిందన్నారు. ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలంటే కార్మికుల్లో ఉత్సాహం పెంచాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలి




బీసీల్లోని అన్ని కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించి, రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ యాత కోరారు. రాష్ట్రంలోని బీసీల పేరుతో కొన్ని కులాలకే రాజకీయ అవకాశాలు పరిమితమవుతున్నాయని, మిగతా వర్గాలు ఓటర్లుగానే మిగిలిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడంతో అనేక బీసీ కులాల ప్రజలు తమ సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనలేకపోతున్నారని తెలిపారు. రాజకీయంగా భాగస్వామ్యం తగ్గడం వల్ల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీల్లోని అన్ని కులాలకు రాజకీయ అవకాశాలు అందేలా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలుతో పాటు, ప్రతి బీసీ కులానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

చెత్త నుంచి విద్యుత్.. కర్నూలుకు స్వచ్ఛ భవిష్యత్



కర్నూలు నగరంలో ఘన వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక ప్రాజెక్టులు వేగం పుంజుకున్నాయి. రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి గార్గేయపురం డంప్ యార్డును పరిశీలించారు. అక్కడ నిర్మిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్ల పనుల పురోగతిని సమీక్షించారు. 60 ఎకరాల్లో పేరుకుపోయిన సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల పాత చెత్తను బయోమైనింగ్ ద్వారా తొలగిస్తున్నట్లు పట్టాభిరామ్ తెలిపారు. గార్గేయపురంలో 15 ఎకరాల్లో రూ.330 కోట్లతో పీపీపీ విధానంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం జరుగుతోందన్నారు. మరో 9.5 ఎకరాల్లో రూ.8 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ రోజుకు 200 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేయనుంది. ఈ ప్లాంట్ ను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, వచ్చే నెల నుంచి ప్రాసెసింగ్ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతతో పనులు వేగంగా పూర్తి చేసి కర్నూలును పరిశుభ్ర, పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దాలని సూచించారు.

భీమిలి రహదారి పనులపై మంత్రి ఆకస్మిక తనిఖీ



భీమిలి-నర్సీపట్నం రహదారి విస్తరణ పనులను ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా చేపడుతున్న ఈ పనులకు రూ.34 కోట్ల వ్యయం అవుతుండగా, ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న రహదారిని నాలుగు లేన్లకు విస్తరిస్తున్నారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, నిర్మాణంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రూ.1.66 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, మొత్తం పనుల్లో 7.34 శాతం పురోగతి సాధించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. పనులు నత్తనడకన సాగకుండా వేగం పెంచి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయంతో మెరుగైన రవాణా అనుసంధానం కోసం ఈ రహదారి విస్తరణ కీలకమని మంత్రి పేర్కొన్నారు.

డేగా వద్ద తుపాకీ మిస్ ఫైర్.. కానిస్టేబుల్ కు గాయం



విశాఖలోని ఐఎన్ ఎస్ డేగా వద్ద మంగళవారం తుపాకీ మిస్ ఫైర్ కావడంతో ఏఆర్ కానిస్టేబుల్ గాయపడ్డాడు. కేంద్ర మంత్రి విమాన భద్రతా విధుల్లో భాగంగా ఏఆర్ పీసీ 768 కొండ సెంట్రీ డ్యూటీలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వహిస్తున్న సమయంలో సుమారు 3.30 గంటలకు అతని వద్ద ఉన్న ఎస్ ఎల్ ఆర్ తుపాకీ అనుకోకుండా మిస్ ఫైర్ అయినట్లు సమాచారం. బుల్లెట్ తగలడంతో ఎడమ వైపు ఛాతి కింది భాగంలో తీవ్ర గాయమైంది. తుపాకీ పేలిన శబ్దం వినిపించడంతో అక్కడున్న ఇతర సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బందికి కానిస్టేబుల్ అపస్మారక స్థితిలో కనిపించాడు. ఆలస్యం చేయకుండా అంబులెన్స్ లో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్య చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఘటనకు దారితీసిన పరిస్థితులపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. భద్రతా విధుల్లో ఉన్న సిబ్బందికి ఆయుధాల నిర్వహణ, అప్రమత్తతపై మరోసారి దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తుచేసింది.

కళాకారుల క్రికెట్‌లో క్రీడా సందడి



విశాఖలో కళాకారుల క్రీడా ప్రతిభకు వేదికగా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న పోటీల సెమీ ఫైనల్ మ్యాచ్‌లను శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాకారులు సమాజ జీవితాల్లో ఆనందం, వెలుగులు నింపుతున్నారని, కళా ప్రతిభకు విశాఖ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. కళారంగాల్లో కొనసాగుతున్న వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. వివిధ కళారంగాలకు చెందిన 12 జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, బుధవారం విజేతలకు నగదు బహుమతులతో పాటు ధనుంజయ ఆర్ట్స్, అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందిస్తామని తెలిపారు. ప్రతిభవంతులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నర్సీపట్నంలో కొత్త సబ్ ట్రెజరీ భవనం ప్రారంభం



ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంలో ట్రెజరీ వ్యవస్థ కీలకమని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. నర్సీపట్నంలో రూ.75 లక్షలతో నిర్మించిన డివిజనల్ సబ్ ట్రెజరీ నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల నిధులు ట్రెజరీల ద్వారా విడుదలైతే ఖర్చులపై స్పష్టమైన లెక్కలు ఉంటాయని అన్నారు. గతంలో విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు నేరుగా నిధులు వెళ్లడంతో జవాబుదారీతనం లోపించేదని గుర్తుచేశారు. ప్రస్తుతం స్పర్శ్ గ్రాంట్లతో పాటు యూనివర్సిటీలకు నిధులు ట్రెజరీల ద్వారానే మంజూరు చేసే విధానం అమల్లోకి వచ్చిందన్నారు. ఉపాధి హామీ నిధుల చెల్లింపులకూ ఇదే విధానాన్ని తీసుకువస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ట్రెజరీ సేవలు వేగంగా, పారదర్శకంగా మారాయని చెప్పారు. పాత ఎమ్మార్వో కార్యాలయం స్థానంలో ఆధునిక భవనం రావడం సంతోషకరమన్నారు. కోటవురట్ల, నక్కపల్లిలోనూ సబ్ ట్రెజరీ భవనాల నిర్మాణం కొనసాగుతోందని వివరించారు.



ఏపీలో ప్రస్తుతం ఎన్నికలు లేవు. కానీ ఎన్నికల వాతావరణానికి మాత్రం కొదవలేదు. జెండాలు కనిపించకపోయినా సర్వేల పేరుతో రాజకీయ వేడి మొదలైంది. ఓటర్లు ఇంకా ఓటు వేయకముందే ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో చెప్పే జ్యోతిష్కులు బయలుదేరారు. నియోజకవర్గానికి ఒక లెక్క, జిల్లాకు ఒక అంచనా, రాష్ట్రానికి మరో గణాంకం. నిన్నటి వరకు రాజకీయ నాయకుల భవిష్యత్తు చెప్పేందుకు జాతకాలు చూసేవారు. ఇప్పుడు చేతిలో ల్యాప్‌టాప్ పట్టుకుని డేటా జాతకాలు చెప్పేవారు రంగంలోకి వచ్చారు. ఒక సంస్థ కూటమికి బలం పెరిగిందంటుంది. మరో సంస్థ కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు రిస్క్ అంటుంది. ఇంకొకరు సేఫ్, ఇంకొకరు మిక్స్‌డ్, మరొకరు రెడ్ జోన్ అంటారు. చివరకు ఓ సామాన్య కార్యకర్తకు ఒక్కటే సందేహం... ఇది సర్వేనా? లేక సర్వే పేరుతో రాజకీయ మార్కెట్‌లో జరుగుతున్న సేల్సా? ఎన్నికల తేదీ ప్రకటించకముందే ఫలితాలు ప్రకటించాలనే ఆత్రం చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్ర కూడా క్రమంగా తగ్గిపోతుందేమోనన్న అనుమానం కలుగుతోంది. ఓటరు ఏం నిర్ణయించాలో ఇంకా నిర్ణయించకముందే సర్వే సంస్థలు నిర్ణయించేస్తున్నాయి. పార్టీలు కూడా ఆ నిర్ణయాలను బట్టి తమ రాజకీయ వ్యూహాలు మార్చుకోవడం మొదలుపెడుతున్నాయి. ఇదే నేటి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త ట్రెండ్.

సర్వేంతర్యామి..

సర్వే బాకా.. జాతక భజన..

ఎన్నికల ముందే మొదలైన పందాలు



• సర్వే బాకా.. జాతక భజన

ఎన్నికల ముందు సర్వేలు రావడం కొత్త కాదు. కానీ ఇప్పుడు వాటి చుట్టూ ఏర్పడుతున్న హడావుడి మాత్రం కొత్త రూపం దాల్చింది. ఒకప్పుడు బాకా ఊదేవారు. ఇప్పుడు డేటా గ్రాఫ్ వేస్తున్నారు. ఒకప్పుడు నాయకుడి జాతకం చెప్పేవారు. ఇప్పుడు నియోజకవర్గం జాతకం చెబుతున్నారు. ఒకప్పుడు "మీ దశ బాగుంది" అనేవారు. ఇప్పుడు "మీ ఓటు శాతం పెరిగింది" అంటున్నారు. ఒకప్పుడు గ్రహాలపై ఆధారపడేవారు. ఇప్పుడు శాంపిల్స్‌పై ఆధారపడుతున్నారు. తేడా ఒక్కటే... అక్కడ జాతక చక్రం, ఇక్కడ ఓటు చక్రం. ఫలితం మాత్రం ఎన్నికల రోజునే తెలుస్తుంది. అందుకే ఇప్పుడున్న ఈ సర్వేల సందడిని చూస్తుంటే ఒక్క మాట గుర్తొస్తుంది... సర్వేంతర్యామి.. ఎన్నికల ముందు బాకాలు భజనలు.. ఏది గొప్ప.. ఏది అబ్బా? ఎన్నికలు రాకముందే ఎవరు గెలుస్తారో చెప్పే వాళ్లు పెరిగిపోయారు. కానీ ప్రజలు ఎవరిని గెలిపిస్తారో చెప్పే హక్కు మాత్రం ఇప్పటికీ ప్రజలదే. సర్వే సంస్థలు అంచనాలు వేయొచ్చు. రాజకీయ పార్టీలు వాటిని విశ్లేషించుకోవచ్చు. మీడియా వాటిపై చర్చించవచ్చు. యూట్యూబ్ ఛానళ్లు వాటికి 'బ్రేకింగ్' ముద్ర వేయవచ్చు. జాతకాలు చెప్పేవాళ్లు గ్రహాల గమనాన్ని పరిశీలించవచ్చు. కానీ బ్యాలెట్ పెట్టె ముందు ఇవన్నీ మూగబోయే క్షణమే ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష. అప్పటివరకు ఎన్ని సర్వేలు వచ్చినా అవన్నీ కేవలం రాజకీయ వాతావరణాన్ని కొలిచే థర్మామీటర్లు మాత్రమే. జ్వరం ఎంత ఉందో అవి చెప్పవచ్చు. కానీ చివరికి మందు పనిచేసిందా లేదా అన్నది ప్రజల తీర్పే చెబుతుంది. సర్వేలు చెప్పేది అంచనా.. ఓటరు చెప్పేది తీర్పు. ఆ తీర్పు వచ్చే వరకు సర్వేంతర్యాములూ, జాతకంతర్యాములూ తమ తమ బాకాలు భజించుకోవచ్చు. ప్రజలు మాత్రం ఎవరి మాట నమ్మాలో, ఎవరిని నమ్మాలో తమ మనసులో ఇప్పటికే లెక్కలు వేసుకుంటూనే ఉంటారు. ఎన్నికల రోజున ఆ లెక్కే తుది లెక్క. మిగతావన్నీ... సేఫ్ జోన్‌లు, రిస్క్ జోన్‌లు, మిక్స్‌డ్ జోన్‌లు, గ్రహణాలు, దశలు... రాజకీయ వినోదానికి పనికొచ్చే మధ్యంతర అంకాలు మాత్రమే.

• సర్వే మాట.. రాజకీయ ఆట

చాణక్య స్ట్రాటజీస్ పేరుతో బయటకు వచ్చిన తాజా సర్వే కూటమికి ఊపు తెచ్చింది. వైసీపీపై కూటమి నేటికి ఎడ్జ్ సాధించినట్టు పేర్కొంది. అంతకు ముందు వచ్చిన ఐఐటీయన్స్ సర్వే ఏపీలో వైసీపీకి అధికారం దక్కొచ్చంది. ఒక సర్వేతో వైసీపీలో హర్షం వ్యక్తమైతే, మరో సర్వేతో ప్రభుత్వం ఆనందిస్తోంది. కానీ అసలు ప్రశ్న మాత్రం ఇక్కడే మొదలవుతుంది... సర్వే అంటే అంచనా మాత్రమేనా? లేక రాజకీయ నిర్ణయాలకు ఆధారమయ్యేంత కచ్చితమైన శాస్త్రమా? ఎన్నికల సర్వే అనేది ప్రజాభిప్రాయాన్ని కొలిచే ప్రయత్నం. అది ఎన్నికల ఫలితం కాదు. ఈ చిన్న తేడాను రాజకీయ పార్టీలు కావాలనే మరిచిపోతున్నాయా అన్నదే అసలు సందేహం. అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా సర్వే వస్తే అది ప్రజల తీర్పుకు సంకేతం. ప్రతికూలంగా వస్తే అది పెయిడ్ సర్వే. ప్రతిపక్షానికి అనుకూలంగా వస్తే ప్రజల్లో మార్పు వచ్చేసిందని ప్రచారం. వ్యతిరేకంగా వస్తే డబ్బులు తీసుకుని చేసిన సర్వే అని విమర్శ. సర్వే కన్నా దానిపై పార్టీల స్పందనే కొన్నిసార్లు ఎక్కువ వినోదాన్ని పంచుతుంది. తమకు అనుకూలంగా వచ్చిన గణాంకాలను ఫ్రేమ్ చేయించుకుని కార్యాలయాల్లో పెట్టుకుంటారు. ప్రతికూలంగా వచ్చిన గణాంకాలను చూసి సర్వే సంస్థ చరిత్ర, యజమాని, ఆర్థిక వనరులు, రాజకీయ సంబంధాలు అన్నీ వెతకడం మొదలు పెడతారు. అంటే గణాంకం నిజమా కాదా అన్నది కాదు.. అది మనకు అనుకూలమా కాదా అన్నదే అసలు ప్రమాణంగా మారింది. ఇదే సర్వేల రాజకీయ శాస్త్రం.

• ప్రజా గళం.. నాయకుడి బాట

ఇదే సమయంలో రైజ్ లేదా ప్రవీణ్ పుల్లట పేరుతో జిల్లాల వారీగా వస్తున్న అంచనాలు మరో రకమైన ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. నియోజకవర్గాలను సేఫ్, రిస్క్ జోన్, మిక్స్‌డ్ అంటూ వర్గీకరిస్తూ ఎమ్మెల్యేల పనితీరుపై అంచనాలు వెలువడుతున్నాయి. ఉభయ గోదావరి ప్రాంతాల్లో కూటమి బలంగానే ఉన్నప్పటికీ కోనసీమ, కాకినాడ ప్రాంతాల్లో కొన్ని స్థానాలు రిస్క్‌లో ఉన్నాయని, కాపు-శెట్టిబలిజ ఓట్ల చీలిక, సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత, స్థానిక స్థాయిలో వైసీపీ కేడర్ చురుకుదనం వంటి అంశాలు ప్రభావం చూపవచ్చని చెబుతున్నారు. కాకినాడలో కొన్ని స్థానాలు ప్రమాదంలో ఉన్నాయని, పిఠాపురం మాత్రం బలమైన కోటగా ఉందని అంచనాలు వినిపిస్తున్నాయి. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోనూ కొన్ని నియోజకవర్గాలకు సేఫ్, కొన్ని ప్రాంతాలకు మిక్స్‌డ్, మరికొన్నింటికి రిస్క్ ట్యాగులు వేస్తున్నారు. ఈ రకమైన వర్గీకరణకు ఒక రాజకీయ ప్రయోజనం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ నాయకత్వానికి ఒక్కసారిగా నియోజకవర్గాలపై దృష్టి పెట్టేలా చేయడం. సిట్టింగ్ ఎమ్మెల్యేల పనితీరు, అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలపై చర్చ మొదలవుతుంది. సర్వే సంస్థకు ఇదే పెద్ద బలం. అయితే ఇక్కడే మరో ప్రశ్న తలెత్తుతుంది. ఒక నియోజకవర్గాన్ని 'రిస్క్ జోన్'గా ప్రకటించిన తర్వాత అక్కడి ఎమ్మెల్యే ఏం చేస్తారు? ముందుగా ప్రజల దగ్గరకు వెళతారా? లేక సర్వే సంస్థను వెతుక్కుంటూ వెళతారా? ఒక నాయకుడికి తన నియోజకవర్గంలో వ్యతిరేకత ఉందని చెప్పడానికి వేల పేజీల డేటా అవసరమా? గ్రామంలోకి వెళ్లి ప్రజలతో నాలుగు గంటలు మాట్లాడితే సరిపోదా? చౌరస్తాలో టీ తాగుతూ ప్రజలు ఏమంటున్నారో వినడానికి డేటా అనలిటిక్స్ అవసరమా? అసలు ప్రజల నాడిని తెలుసుకోవాల్సిన నాయకులు ఇప్పుడు సర్వే నాడిని తెలుసుకోవడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారేమో అన్న అనుమానం కలుగుతోంది. రాజకీయ నాయకుడు ప్రజల మధ్య ఉండాల్సిన చోట కన్సల్టెంట్ గదిలో ఉంటే, ప్రజల మనసులో ఏముందో సర్వే సంస్థకు ఎలా తెలుస్తుంది? కాగితంపై గీసిన గ్రాఫ్ కంటే గ్రామంలో వినిపించే నాలుగు మాటలకు ఎక్కువ విలువ ఉంటుంది. కానీ రాజకీయాలు ఇప్పుడు ఆ నాలుగు మాటల్ని కూడా శాతం, గ్రాఫ్, రిస్క్ జోన్‌గా మార్చేస్తున్నాయి.

• సర్వే ఈక్వేషన్స్.. పక్కా లోకల్ లెక్క

ఇక స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఈ సర్వేలకు మరింత పరిమితి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం ఒక యూనిట్ అయితే స్థానిక ఎన్నికల్లో వార్డు, గ్రామం, కుటుంబం, వ్యక్తిగత సంబంధం, కుల సమీకరణం, స్థానిక నాయకుడి ప్రభావం... ఇవన్నీ ఒక్కసారిగా ప్రాధాన్యం పొందుతాయి. ఒక ఎమ్మెల్యే అసెంబ్లీలో భారీ మెజారిటీతో గెలిచినా అతని నియోజకవర్గంలోని ప్రతి వార్డులో అదే బలం ఉంటుందని చెప్పలేం. అలాగే అసెంబ్లీలో ఓడిపోయిన పార్టీ స్థానిక సంస్థల్లో బలమైన అభ్యర్థిని నిలబెట్టి గెలవడం కూడా అసాధ్యం కాదు. అందుకే స్థానిక ఎన్నికల కోసం అసెంబ్లీ ఓటు శాతాన్ని యథాతథంగా తీసుకుని లెక్కలు వేయడం ప్రమాదకరం. స్థానిక రాజకీయాలు 'పార్టీ' కంటే 'మనిషి' చుట్టూ తిరిగే సందర్భాలు అనేకం. సర్పంచ్ ఎవరు? వార్డు అభ్యర్థి ఎవరు? అతనికి గ్రామంలో కుటుంబ సంబంధాలు ఎలా ఉన్నాయి? ప్రత్యర్థి వర్గం ఎవరి వెంట ఉంది? ఈ లెక్కలు సర్వే పట్టికల్లో కనిపించకపోవచ్చు. కనిపించినా ఎన్నికల రోజున ఓటుగా మారుతుందనే హామీ ఉండదు. అయినా అధికార పార్టీలు సర్వేలను ఎందుకు అంత సీరియస్‌గా తీసుకుంటాయి? కారణం చాలా సులభం. అధికారంలో ఉన్న పార్టీకి ప్రతి నియోజకవర్గంపై ఒకేసారి పూర్తి సమాచారం ఉండదు. ఎమ్మెల్యేలు తమకు అనుకూలమైన సమాచారాన్ని మాత్రమే అధిష్ఠానానికి చేరవేయవచ్చు. జిల్లా నాయకులు తమ వర్గానికి అనుకూలంగా పరిస్థితిని చూపించవచ్చు. స్థానిక నేతలు తమ ప్రత్యర్థి బలాన్ని తక్కువ చేసి చెప్పవచ్చు. ఇలాంటి సమయంలో స్వతంత్ర సంస్థ పేరుతో వచ్చే సర్వే అధికార పార్టీకి ఒక ప్రత్యామ్నాయ అద్దంలా పనిచేస్తుంది. అయితే ఆ అద్దం ఎవరు తయారు చేశారు? అందులో కనిపించే చిత్రం ఎంతవరకు వాస్తవం? ఏ ప్రశ్నలు అడిగారు? ఎవరిని అడిగారు? ఏ ప్రాంతాల్లో శాంపిల్ తీసుకున్నారు? వయస్సు, లింగం, కులం, గ్రామీణ-పట్టణ విభజన ఎలా ఉంది? గత ఓటింగ్ ప్రవర్తనను ఎలా పరిగణనలోకి తీసుకున్నారు? ఈ వివరాలు బహిరంగంగా లేకపోతే శాతాలు ఎంత ఆకర్షణీయంగా ఉన్నా వాటిని తుది నిజాలుగా తీసుకోవడం సరికాదు.

• గెలిస్తామంటే గొప్ప.. ఓడతామంటే తప్ప

అధికార పక్షాలకు అనుకూలంగా కనిపించే సర్వేలు వచ్చినప్పుడు మరో రాజకీయ ప్రయోజనం కూడా ఉంటుంది. పార్టీ కేడర్‌లో నమ్మకం పెంచడం. "ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి ఉంది" అని నాయకత్వం చెప్పడానికి గణాంకం దొరుకుతుంది. అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యేలను కూడా "ఇంకా పని చేయాలి" అని హెచ్చరించడానికి రిస్క్ జోన్ ఉపయోగపడుతుంది. అభ్యర్థుల ఎంపికకు సర్వేలు ఒక ఫిల్టర్‌గా మారతాయి. నిధుల కేటాయింపు, నియోజకవర్గాల పర్యటనలు, స్థానిక నాయకుల మార్పులు, సంస్థాగత బలోపేతం వంటి నిర్ణయాల్లో కూడా ఈ డేటాను ఉపయోగించవచ్చు. అంటే సర్వే అనేది కేవలం ఎన్నికల అంచనా కాదు; రాజకీయ నిర్వహణలో ఒక సాధనంగా మారింది. అందుకే పార్టీలు దానిని పూర్తిగా విస్మరించలేవు. అయితే సమస్య ఎక్కడ వస్తుంది అంటే సర్వేను 'సాధనం'గా ఉపయోగించాల్సిన పార్టీ దానిని 'సత్యం'గా భావించినప్పుడు. ప్రతిపక్షాల పరిస్థితి కూడా అంతే ఆసక్తికరం. తమకు అనుకూలంగా వచ్చిన సర్వేలను పట్టుకుని "ప్రజలు మార్పు కోరుకుంటున్నారు" అంటారు. ప్రతికూల సర్వే వస్తే "అధికార పార్టీ డబ్బులు పెట్టి చేయించింది" అంటారు. ఒకే సంస్థ గతంలో తమకు అనుకూలంగా అంచనా వేసినప్పుడు అదే సంస్థ గొప్పది. ఇప్పుడు వ్యతిరేకంగా చెబితే నమ్మదగినది కాదు. రాజకీయ పార్టీలకు సర్వే సంస్థలపై ఉన్న విశ్వాసం కూడా ఎన్నికల ఫలితాల మాదిరిగానే పార్టీ ఆధారితంగా మారింది. గెలిస్తే సర్వే గొప్పది. ఓడితే సర్వే తప్పు. మధ్యలో మాత్రం ప్రజలు నవ్వుకోవాల్సిందే.

• జాతకంతో తొలి అడుగు.. ఫ్లాష్ సర్వే

ఇక్కడ జాతకాలు చెప్పే స్వామిలు, శర్మలు, శాస్త్రిలు, వర్మలు చేసే వినోదాలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. రాజకీయ నాయకుడి భవిష్యత్తు చెప్పడానికి ఒకరు ఓట్ల శాతాలు చూస్తారు. మరొకరు గ్రహాల స్థానాలు చూస్తారు. ఒకరు రిస్క్ జోన్ అంటారు. ఇంకొకరు గ్రహణం అంటారు. ఒకరు 2029లో అధికార మార్పు అంటారు. ఇంకొకరు ఆ నాయకుడి దశ తిరిగిందంటారు. సోషల్ మీడియా ఛానళ్లకు మాత్రం రెండూ ఒకే రకమైన బంగారు గనులు. "సంచలన సర్వే", "షాకింగ్ సర్వే", "ఫలితాలు తారుమారు", "నాయకుడికి ముప్పు", "ఆ పార్టీకే అధికారం" అంటూ థంబ్‌నెయిల్ తయారవుతాయి. వీడియోకు లక్షల వ్యూస్ వస్తాయి. మరుసటి రోజు కొత్త సర్వే వస్తే పాత వీడియోను ఎవరూ గుర్తు చేసుకోరు. జాతకం తప్పినా కొత్త తేదీ ఉంటుంది. సర్వే తప్పినా కొత్త సాంపిల్ ఉంటుంది. ప్రజాస్వామ్యం మాత్రం తన దారిన తాను నడుస్తూనే ఉంటుంది. ఈ సర్వేల హడావుడిలో మరో ప్రమాదం ఉంది. నాయకులు అసలు ప్రజా సమస్యలను మర్చిపోయే అవకాశం. రహదారి బాగుందా? సాగునీరు అందుతోందా? నిరుద్యోగ యువత పరిస్థితి ఏంటి? ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరుతున్నాయా? ఆసుపత్రుల్లో సేవలు ఎలా ఉన్నాయి? పాఠశాలల్లో పరిస్థితి ఏమిటి? స్థానిక సంస్థలకు నిధులు ఉన్నాయా? ఇవన్నీ ఎన్నికల్లో అసలు ప్రశ్నలు. కానీ వాటి స్థానంలో "ఎమ్మెల్యే ర్యాంక్ ఎంత?", "రిస్క్ జోన్‌లో ఎవరు?", "కూటమి ఓటు శాతం ఎంత?", "వైసీపీ గెలిచేంత పెరింగిదా?" అనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. ప్రజల జీవితాల కంటే రాజకీయ పార్టీల గ్రాఫ్‌లకు ప్రాధాన్యం పెరిగితే సర్వే రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని కాకుండా రాజకీయ మార్కెటింగ్‌ను బలోపేతం చేస్తాయి.

• నిన్నటి బలం.. నేటి లెక్క

ప్రస్తుతం కూటమి అధికారంలో ఉంది. అందువల్ల కూటమికి అనుకూలంగా వస్తున్న ప్రతి సర్వే సహజంగానే ప్రభుత్వానికి ప్రచార ఆయుధంగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో రిస్క్ జోన్‌లో ఉన్న నియోజకవర్గాలపై హెచ్చరికలు వస్తే వాటిని ప్రభుత్వం అంతర్గత సమీక్షకు ఉపయోగించుకోవచ్చు. ఇది రాజకీయంగా తప్పు కాదు. అసలు తప్పు సర్వేను తుది తీర్పుగా భావించడం. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజల్లో సానుకూలత ఉన్నా అది శాశ్వతం కాదు. ప్రతిపక్షం బలహీనంగా ఉన్నా అది శాశ్వతం కాదు. రాజకీయాల్లో నిన్నటి బలం రేపటి హామీ కాదు. 2024లో జరిగిన ఎన్నికల తీర్పును 2026లో అదే రూపంలో పునరావృతమవుతుందని భావించడం ఎంత ప్రమాదకరమో, 2026లో వచ్చిన సర్వేను 2029 ఫలితంగా భావించడం కూడా అంతే ప్రమాదకరం. వైసీపీకి కూడా ఈ సర్వేలు ఒక హెచ్చరికగానే చూడాలి. 2024 పరాజయం తర్వాత కేడర్‌ను నిలబెట్టుకోవడం, స్థానిక స్థాయిలో సంస్థాగత బలం పెంచుకోవడం, నాయకుల మధ్య సమన్వయం, ప్రజా సమస్యలపై పోరాటం... ఇవే ఆ పార్టీకి అవసరం. సర్వేను కొట్టిపారేయడం సులభం. కానీ సర్వేలో చెప్పిన ప్రతికూల అంశాల్లో ఏదైనా వాస్తవం ఉందా అని పరిశీలించడం కష్టం. ఆ కష్టాన్ని స్వీకరించే ప్రతిపక్షమే పునరాగమనానికి సిద్ధమవుతుంది. "పెయిడ్ సర్వే" అని ఒక మాటతో కొట్టిపారేస్తే కార్యకర్తల మనోధైర్యం కొంతకాలం నిలబడొచ్చు. కానీ గ్రామంలో పరిస్థితి మారదు. ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడానికి సర్వే సంస్థ అవసరం లేదు. పార్టీ నాయకత్వం ప్రజల మధ్యకు వెళితే చాలు.

• సర్వే లెక్క.. సేఫ్ ట్యాగ్

కూటమి పార్టీలకు కూడా ఈ సర్వేలు విజయోత్సాహానికి లైసెన్స్ కావు. 2024 విజయం ఒక పెద్ద రాజకీయ అధిక్యం ఇచ్చింది. కానీ స్థానిక ఎన్నికలు ఆ అధిక్యాన్ని పరీక్షించే వేదిక కావచ్చు. ముఖ్యంగా అభ్యర్థుల ఎంపికలో తప్పులు జరిగితే పార్టీ ఓటు ఉన్నా స్థానికంగా నష్టం జరిగే అవకాశం ఉంది. టీడీపీ-జనసేన-బీజేపీ మధ్య ఓటు బదిలీ అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసినట్టే ప్రతి స్థానిక ఎన్నికల్లో పనిచేస్తుందని భావించడం కూడా సరికాదు. గ్రామ స్థాయిలో వ్యక్తిగత సంబంధాలు, వర్గపోరు, స్థానిక అభిమానం, సామాజిక సమీకరణాలు కీలకం. అందుకే సర్వే చెప్పిన 'సేఫ్' స్థానాన్ని కూడా పార్టీలు నిర్లక్ష్యం చేయకూడదు. 'రిస్క్' స్థానాన్ని చూసి భయపడాల్సిన అవసరం లేదు. అసలు సర్వే ఇచ్చే విలువైన సమాచారం... ఎక్కడ పని చేయాలి, ఎక్కడ లోపం ఉంది, ఎక్కడ నాయకత్వాన్ని మార్చాలి... అంతవరకే. అంతిమంగా సర్వే సంస్థలపై ఒక ప్రశ్న మాత్రం తప్పనిసరిగా ఉండాలి. ఈ సర్వే ఎవరి కోసం? దాని నిధులు ఎవరు సమకూర్చారు? పూర్తి పద్ధతి ఏమిటి? సాంపిల్ ఎలా ఎంపికైంది? ప్రశ్నలు ఏమిటి? మార్జిన్ ఆఫ్ ఎర్రర్ ఎంత? గత అంచనాల్లో ఏ మేరకు కచ్చితత్వం ఉంది? ఈ వివరాలు చెప్పకుండా కేవలం భారీ సాంపిల్, వేల పేజీల డేటా, పందల నియోజకవర్గాల విశ్లేషణ అని చెప్పడం వల్ల విశ్వసనీయత ఆటోమేటిక్‌గా పెరగదు. సంఖ్య పెద్దదైతే సత్యం పెద్దదవదు. గణాంకం శాస్త్రీయంగా కనిపిస్తే చాలు, అది శాస్త్రీయమే అవుతుందని కూడా లేదు. అదే సమయంలో ప్రతి సర్వేను పెయిడ్ అని కొట్టిపారేయడం కూడా అంతే అవివేకం. సర్వేను నమ్మాలా వద్దా అన్నది దాని పద్ధతి, పారదర్శకత, గత పనితీరు, డేటా నాణ్యత ఆధారంగా నిర్ణయించాలి. రాజకీయ నాయకులకు ఒక చిన్న సలహా. సర్వేను చూడండి. కానీ ప్రజలను మరింతగా చూడండి. డేటాను చదవండి. కానీ గ్రామాన్ని కూడా చదవండి. రిస్క్ జోన్ అని చెప్పిన నియోజకవర్గంలో ప్రజలు ఎందుకు అసంతృప్తిగా ఉన్నారో తెలుసుకోండి. సేఫ్ అని చెప్పిన నియోజకవర్గంలో ఎందుకు సేఫ్‌గా ఉన్నారో తెలుసుకోండి. అధికారంలో ఉన్నవారు సర్వేలో తమకు వచ్చిన శాతాన్ని చూసి మురిసిపోకుండా, అందులో కనిపించని అసంతృప్తిని గుర్తించాలి. ప్రతిపక్షం ప్రతికూల శాతాన్ని చూసి నిరుత్సాహపడకుండా, అందులో దాగి ఉన్న అవకాశాన్ని గుర్తించాలి. ఇదే రాజకీయ పరిపక్వత.



ఢిల్లీ రోడ్లపై ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు కదిలిన ప్రతిపక్ష ఎంపీల మార్చ్‌ను బారికేడ్లు అడ్డుకున్నాయి. నినాదాలు మిన్నంటాయి. పోలీసులు అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ బారికేడ్ ఎక్కారు. ప్రియాంక గాంధీతో పాటు పలువురు నేతలు నిర్బంధానికి గురయ్యారు. చివరకు ఆకాశవాణి భవన్ సమీపంలోనే ఎంపీలు బైఠాయించి ధర్నాకు దిగారు. "జ్ఞానేశ్ బ్రో.. ఇక చాలు.. రాజీనామా చేయి" అంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య ఢిల్లీ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టించింది. కానీ ఈ ఆగ్రహానికి అసలు కారణం ఏమిటి? ఫామ్-6లో మార్పులపై సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు ఈ పోరాటాన్ని ఎందుకు మరింత తీవ్రం చేశాయి? సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల వెనుక అసలు రాజకీయ వ్యూహం ఏమిటి? "తొలుబొమ్మ పోవాలి.. ఆడించే ఇద్దరు కూడా బాధ్యత వహించాలి" అంటూ కాంగ్రెస్ మోదీ-షాపై ఎందుకు నేరుగా గురిపెట్టింది? మరోవైపు బీజేపీ మాత్రం ఇది రాహుల్ రాజకీయ పునరాగమనానికి మరో ప్రయత్నమేనంటోంది. ఈ పోరాటం కేవలం ఒక సీఈసీ రాజీనామా డిమాండ్‌గా ముగుస్తుందా? లేక దేశ ఎన్నికల వ్యవస్థపై మరింత పెద్ద రాజకీయ, న్యాయ పోరాటానికి నాంది పలుకుతుందా? ఢిల్లీ బారికేడ్ల దాటి ఆందోళన ఎందుకు జరుగుతోంది? దేశ ప్రజాస్వామ్యం ఇప్పుడు ఏ మలుపు తిరగబోతోంది?

జ్ఞానేశ్ జా: గో బ్యాక్

కొత్త నినాదంతో కేంద్రానికి సెట్ బ్యాక్



సీఈసీతో అమీతుమీ..
నిరసనలతో రాజకీయ సునామీ

బారికేడ్ ఎక్కిన రాహుల్ గాంధీ

విపక్షాల అసలు టార్గెట్ ఆ ఇద్దరే!

ఆందోళనలతో దద్దరిల్లిన ఢిల్లీ వీధులు

ఢిల్లీలో అక్టోబర్ 6న రాజకీయ ఉత్కంఠ ఒక్కసారిగా తారస్థాయికి చేరింది. ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం, ఓటర్ల జాబితా సవరణ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పాత్రపై ప్రతిపక్షాల ఆరోపణలు చివరకు పార్లమెంట్ గేట్ల నుంచి రోడ్డుపైకి వచ్చాయి. ఇండియా కూటమికి చెందిన ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం అయిన నిర్వచన్ సదన్ వైపు భారీ మార్చ్ చేపట్టారు. ప్రధాన డిమాండ్ ఒక్కటే... సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి. సెప్టెంబర్ 30న జరిగిన 19 ప్రతిపక్ష పార్టీల సమావేశం తరువాత ఈ ఆందోళనకు పిలుపునిచ్చారు. అక్టోబర్ 6 ఉదయం నుంచే ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. పార్లమెంట్ పరిసరాలు, విజయ్ చౌక్, ఆకాశవాణి భవన్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో అనేక దశల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది కూడా రంగంలోకి దిగారు. నిరసనకారులు ముందుకు కదలకుండా పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి మరింత ఉత్కంఠభరితంగా మారింది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, అఖిలేష్ యాదవ్, అభిషేక్ బెనర్జీ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే వారిని తీసుకెళ్తున్న బస్సుల నుంచి కొందరు బయటకు వచ్చి ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోనే నిరసన కొనసాగించారు. రాజకీయ నిరసనగా ప్రారంభమైన మార్చ్ క్రమంగా ప్రతిష్టాత్మకమైన రాజకీయ ముఖాముఖిగా మారింది.



• రాహుల్ బారికేడ్ ఎక్కిన క్షణం

ప్రతిపక్షాల మార్చ్‌కు అడ్డుగా నిలిచిన బారికేడ్లు ఆ రోజు రాజకీయ దృశ్యానికి ప్రతీకగా మారాయి. ముందుకు వెళ్లేందుకు అనుమతి లేకపోవడంతో రాహుల్ గాంధీ పోలీసు బారికేడ్‌పైకి ఎక్కారు. ఆయనతో పాటు ప్రియాంక గాంధీ కూడా బారికేడ్ ఎక్కిన దృశ్యాలు తీవ్ర చర్చకు దారితీశాయి. తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ కూడా బారికేడ్‌పైకి ఎక్కారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆకాశవాణి భవన్ గ్రిల్‌పైకి ఎక్కి అక్కడే ఉండిపోయారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. కొంతసేపటి తరువాత కాంగ్రెస్ కార్యకర్తలు ఆకాశవాణి భవన్ గేట్లు తెరవడానికి ప్రయత్నించడంతో యువ కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాహుల్, ప్రియాంకలను కూడా కొంతసేపు నిర్బంధించి బస్సులోకి ఎక్కించారు. అఖిలేష్ యాదవ్, అభిషేక్ బెనర్జీని మరో బస్సులో తీసుకెళ్లారు. కానీ ఈ చర్యలు నిరసనను ఆపలేకపోయాయి. చివరకు ప్రతిపక్ష ఎంపీలు రోడ్డుపైనే కూర్చొని ధర్నా చేపట్టారు. "జ్ఞానేశ్.. నీ పని అయిపోయింది బ్రో.. ఇక రాజీనామా చేయి." టూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య రాజకీయ పోరాట తీవ్రతను స్పష్టంగా చూపించింది. నిరసనకారులు జ్ఞానేశ్ కుమార్‌ను ఆర్ఎస్ఎస్ దుస్తుల్లో చూపించే కటౌట్లను ప్రదర్శించారు. "బీజేపీనే సీఈసీ.. సీఈసీనే బీజేపీ!"... "ఓటు దొంగ.. పదవి వదిలేయ్!" "ప్రజాస్వామ్యం అమ్మకానికి కాదు!" వంటి నినాదాలు వినిపించాయి. ఈ దృశ్యాలు కేవలం ఒక నిరసనగా కాకుండా ఎన్నికల సంస్థపై రాజకీయ విశ్వాస సంక్షోభానికి ప్రతిబింబంగా కనిపించాయి.

• "జ్ఞానేశ్వర్ బ్రో.. ఇక చాలు"

ఆకాశవాణి భవన్ వద్ద నిలిచిపోయిన రాహుల్ గాంధీ తన రాజకీయ దాడిని మరింత పదును పెట్టారు. ఎన్నికల కమిషనర్లను కలవాలని తాము కోరుతున్నామని ఆయన చెప్పారు. "మేము కేవలం ఎన్నికల కమిషనర్లను కలవాలనుకుంటున్నాం. మిలియన్ల మంది ప్రజలు మాకు ఓటు వేశారు. మాకు ప్రశ్నలు అడిగే హక్కు ఉంది. కానీ ఎన్నికల సంఘం మాట్లాడేందుకు ఎందుకు సిద్ధంగా లేదు?" అని ప్రశ్నించారు. ఆ తరువాత ఆయన చేసిన మరో తీవ్ర వ్యాఖ్య దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి దేశ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. "ఓట్ చోరీ" ద్వారా దేశాన్ని హైజాక్ చేశారని ఆరోపిస్తూ, ఇందులో పాల్గొన్న వారందరిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ కూడా మరింత ఘాటు వ్యాఖ్యలు చేశారు. వెస్ట్ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు "మాస్ మానిప్యులేషన్, రిగ్గింగ్‌కు పాఠ్యపుస్తక ఉదాహరణ"గా మారాయని, దీనికి జ్ఞానేశ్ కుమార్ పర్యవేక్షణ ఉందని ఆయన ఆరోపించారు. "తొలుబొమ్మ పోవాలి.. ఆడించే ఇద్దరు విదూషకులు కూడా బాధ్యత వహించాలి" అనే భావంతో చేసిన ఆయన వ్యాఖ్యలు నేరుగా మోదీషా వైపు రాజకీయ ఆరోపణలను మళ్లించాయి. ఎన్నికల అక్రమాలకు, సీఈసీ ఒక్కరే బాధ్యులు కారని... ఆయన వెనుక ఉన్న రాజకీయ వ్యవస్థపై కూడా బాధ్యత నిర్ధారించాల్సి ఉందన్నది ఆ పార్టీ అంటోంది.

• ఫామ్-6 వివాదమే అసలు చిచ్చు

ఈ మొత్తం వివాదానికి కేంద్రబిందువుగా మారింది ఫామ్ 6 మార్పుల అంశం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు చేర్చుకోవడానికి ఫామ్ 6 ఉపయోగిస్తారు. సర్ సమయంలో ఈ ఫామ్‌కు అదనపు డిక్లరేషన్ జత చేయడంపై ప్రతిపక్షాలు మొదటి నుంచే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటనలో సర్‌కు సంబంధించిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందనే భావన కలిగించే వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అక్టోబర్ 5న సుప్రీంకోర్టు మాత్రం ఫామ్ 6లో చేసిన ఏ మార్పునూ తాము ఆమోదించలేదని స్పష్టం చేసింది. రికార్డులు పరిశీలించిన తరువాత ఎవరు మార్పులు చేశారో, ఎవరి అనుమతితో చేశారో పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఇదే అంశం ప్రతిపక్షాల రాజకీయ దాడికి ప్రధాన ఆయుధంగా మారింది. అయితే ఎన్నికల సంఘం తన నిర్ణయాలకు చట్టబద్ధమైన ఆధారం ఉందని చెబుతోంది. కమిషన్‌లోని సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు ఉండటం సంస్థలో జరిగే సాధారణ చర్చలలో భాగమేనని, సర్‌కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఈసీ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో సర్‌కు సంబంధించిన నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన నివేదికలు కూడా వివాదాన్ని మరింత పెంచాయి. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది... ఎన్నికల ప్రక్రియలో తీసుకున్న నిర్ణయాలపై పారదర్శకత ఎంత ఉంది? కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు ఎంతవరకు సాధారణం? ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు సంస్థ ఇంకేం వివరణ ఇవ్వాలి? ఈ ప్రశ్నలకు తుది సమాధానం న్యాయపరమైన పరిశీలన తరువాతే స్పష్టమవుతుంది.

• కాంగ్రెస్ దాడి.. బీజేపీ ఎదురుదాడి

కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తుండగా బీజేపీ కూడా వెనక్కి తగ్గలేదు. బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. సుప్రీంకోర్టు ఫామ్ 6ను అక్రమమని చెప్పలేదని, కేవలం కేసును పరిశీలించేందుకు నోటీసులు జారీ చేసిందని ఆయన అన్నారు. కోర్టు తుది తీర్పు వెలువడకముందే రాహుల్ గాంధీ దేశంలో గందరగోళ వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ రాజకీయంగా రాహుల్‌ను తిరిగి నిలబెట్టేందుకు ఇలాంటి అంశాలను ఉపయోగిస్తోందని బీజేపీ విమర్శించింది. మరోవైపు శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్ మాత్రం జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగేందుకు నైతిక హక్కు లేదని అన్నారు. సుప్రీంకోర్టును కూడా తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఎన్నికల సంఘం తీరుపై మరింత విస్తృత విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం బీజేపీ సభ్యులకే భారతీయ పౌరులుగా గుర్తింపు ఇస్తున్నట్టు కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ఇదే సమయంలో బీజేడీ కూడా ప్రతిపక్ష నిరసనలో చేరింది. మొత్తం 19 పార్టీల సమావేశంలో పాల్గొన్న కూటమి భాగస్వాముల్లో 237 మంది ఎంపీలు నిరసన మార్చ్‌లో పాల్గొన్నారని సమాచారం. ఈ ఆందోళనలకు డీఎంకే, ఆప్ మినహా అన్ని పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఓవైపు ఎన్నికల సంఘంపై తీవ్ర రాజకీయ ఒత్తిడి, మరోవైపు కేంద్ర అధికార పక్షం నుంచి ఘాటైన ప్రతిదాడి... ఢిల్లీ రాజకీయ వాతావరణం రెండు ధ్రువాలుగా విడిపోయింది.



• రోడ్డుపై నిరసన.. దేశం ముందున్న ప్రశ్న

ఈ వివాదం ఢిల్లీకే పరిమితం కాలేదు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ వివిధ సంస్థలు దేశంలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అక్టోబర్ 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చారు. తమ కార్యకర్తలకు పోలీసులు నోటీసులు ఇచ్చారని, ఢిల్లీ ఆందోళనలో పాల్గొనవద్దని ఒత్తిడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రయాణ ఖర్చులకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు ప్రశ్నించారని కూడా ఆయన చెప్పారు. భవిష్యత్ నిరసన హింసాత్మకంగా మారుతుందని పోలీసులు ముందుగానే ఎలా అంచనా వేశారని ఆయన ప్రశ్నించారు. ఇదే సమయంలో ఐదు వామపక్ష విద్యార్థి సంఘాలు కూడా అక్టోబర్ 10న జంతర్‌మంతర్ వైపు మార్చ్ నిర్వహించనున్నట్టు ప్రకటించాయి. సర్‌ను రద్దు చేయడం, ఎన్నికల సంఘంలో సంస్కరణలు చేపట్టడం, సీఈసీ రాజీనామా చేయడం వారి ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. ఢిల్లీలో అక్టోబర్ 6న జరిగిన నిరసనతో మరో ప్రభావం కూడా కనిపించింది. భారీ బారికేడ్లు, ట్రాఫిక్ మళ్లింపులతో ల్యూటియన్స్ ఢిల్లీలో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కనాట్ ప్లేస్, పార్లమెంట్ స్ట్రీట్, అశోకా రోడ్, జంతర్‌మంతర్ రోడ్ సహా పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదించాయి. పోలీసులు బాడీ కెమెరాలతో నిరసనను రికార్డు చేశారు. చివరకు ప్రశ్న ఒక్కటే మిగిలింది... ఎన్నికల సంఘంపై రాజకీయ పోరాటం ఇంత తీవ్రంగా మారినప్పుడు, ప్రజల విశ్వాసాన్ని తిరిగి ఎలా బలపరచాలి? సీఈసీ రాజీనామా చేస్తారా లేదా అన్నది ఒక రాజకీయ డిమాండ్. కానీ ఎన్నికల వ్యవస్థపై నమ్మకం నిలవడం మాత్రం దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన మరింత పెద్ద అంశం. సుప్రీంకోర్టు పరిశీలన, ఎన్నికల సంఘం వివరణలు, రాజకీయ పార్టీల ఆరోపణలు... ఇవన్నీ కలిపి చూస్తే ఈ వివాదం ఇంకా ముగిసినట్టుగా కనిపించడం లేదు. ఢిల్లీ రోడ్డుపై ఆగిపోయిన ఆ మార్చ్ నిజానికి ఒక పెద్ద రాజకీయ పోరాటానికి మొదటి అధ్యాయం మాత్రమేనా? లేక న్యాయపరమైన పరిశీలనతో వివాదానికి స్పష్టమైన దారి దొరుకుతుందా? దేశం ఇప్పుడు అదే సమాధానం కోసం ఎదురుచూస్తోంది.





జ్ఞానేశ్వర్ అసలేం చేశాడు?

సర్ చుట్టూ రాజకీయ తుపాన్

సీఈసీపై అనుమానం ఎక్కడ మొదలైంది?

ఓట్ల జాబితా మార్పుల వెనుక రహస్యమేంటి?

భారత ఎన్నికల వ్యవస్థలో ప్రధాన బాధ్యత వహించే ఎన్నికల సంఘం ఇప్పుడు రాజకీయ ఆరోపణల కేంద్రంగా మారింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు ఢిల్లీలో ఆందోళనకు దిగడం ఈ వివాదాన్ని మరింత తీవ్రం చేసింది. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, అఖిలేశ్ యాదవ్, టీఎంసీ నేతలు సహా పలువురు విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ నిర్వహించారు. "ఓటు చోరీ" అంటూ వారు చేస్తున్న ఆరోపణల వెనుక ప్రధాన అంశం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణగా పిలుస్తున్న సర్... బీహార్‌లో ప్రారంభమైన ఈ ప్రక్రియ తర్వాత దేశంలోని అనేక రాష్ట్రాలకు విస్తరించింది. ఎన్నికల సంఘం మాత్రం దీని ఉద్దేశం నకిలీ, డూప్లికేట్, అర్హత లేని పేర్లను తొలగించి అర్హులైన ఓటర్లను జాబితాలో ఉంచడమేనని చెబుతోంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం పత్రాల ప్రక్రియ కఠినంగా మారితే నిజమైన ఓటర్లు కూడా జాబితా నుంచి బయటపడే ప్రమాదం ఉందని అంటున్నాయి. 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించారన్న నివేదికలు ఈ ఆందోళనకు మరింత బలం ఇచ్చాయి. ఈ సంఖ్యను బట్టి వివాదం సాధారణ ఓటర్ల జాబితా సవరణగా కాకుండా కోట్లాది పౌరుల ఓటు హక్కుతో ముడిపడిన అంశంగా మారింది. అయితే తొలగించిన ప్రతి పేరు శాశ్వతంగా ఓటు హక్కు కోల్పోయిందని అర్థం కాదు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, అప్పీళ్ల ద్వారా పేర్లను తిరిగి చేర్చే విధానం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అసలు ప్రశ్న మాత్రం ఇదే... ఇంత భారీ స్థాయిలో మార్పులు జరుగుతున్నప్పుడు ప్రక్రియ ఎంత పారదర్శకంగా సాగింది?

ముగ్గురు కమిషనర్ల వ్యవస్థలో మొదటి పగులు

జ్ఞానేశ్ కుమార్‌పై వచ్చిన ప్రధాన ఆరోపణల్లో మొదటిది ఎన్నికల సంఘం లోపలే ఉత్పన్నమైన అభ్యంతరాలకు సంబంధించినది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధనాత్మక కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. ఓటర్లను చేర్చడం, తొలగించడం, ఓటర్ రిజిస్ట్రేషన్ విధానాల్లో మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి సర్‌కు అత్యంత కీలకమైన అంశాలే ఈ విభేదాల పరిధిలో ఉన్నట్లు కథనం పేర్కొంది. ఒక సందర్భంలో సీఈసీ తీసుకున్న చర్యను "అనధికారికం, చట్టవిరుద్ధం"గా ఇద్దరు కమిషనర్లు అభివర్ణించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముగ్గురు సభ్యుల ఎన్నికల సంఘంలో నిర్ణయాలు మెజారిటీ లేదా ఏకాభిప్రాయంతో తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ఇద్దరు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారన్న వార్త సహజంగానే తీవ్రమైన ప్రశ్నలకు దారితీసింది. అయితే ఇక్కడ మరో వైపు కూడా ఉంది. ఈసీ ఈ విభేదాలను పూర్తిస్థాయి అంతర్గత సంక్షోభంగా అంగీకరించలేదు. ముసాయిదా దశలో సభ్యులు అభిప్రాయాలు, సూచనలు ఇవ్వడం సాధారణ పరిపాలనా ప్రక్రియేనని చెప్పింది. ఇదే అంశంపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు ఇప్పుడు న్యాయపరిశీలనలో ఉన్నాయి. చట్టబద్ధమైన ప్రక్రియ పాటించకపోతే ఎన్నికల సంఘం నిర్ణయాలను రద్దు చేసే అవకాశాన్ని కోర్టు ప్రస్తావించింది.

కోట్ల పేర్లు తొలగింపుతో పెరిగిన అనుమానాలు


మూడో ప్రధాన అంశం సర్ పరిధి, దాని ప్రభావం. ఎన్నికల సంఘం ప్రకారం ఓటర్ల జాబితాలను శుద్ధి చేయడం ప్రజాస్వామ్య ప్రక్రియలో అవసరమైన బాధ్యత. మరణించిన వ్యక్తులు, డూప్లికేట్ పేర్లు, చిరునామా మార్చినవారు, అర్హత లేని నమోదులను గుర్తించడం దాని ఉద్దేశమని అధికారిక వివరణ చెబుతోంది. ప్రభుత్వం కూడా సర్‌కు పలు రక్షణ చర్యలు ఉన్నాయని పేర్కొంది. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లడం, ఒక వ్యక్తిని గుర్తించలేకపోతే పలుమార్లు ప్రయత్నించడం, డ్రాఫ్ట్ జాబితా విడుదల తర్వాత క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం కల్పించడం, అప్పీల్ వ్యవస్థను అందుబాటులో ఉంచడం వంటి చర్యలు ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అయినా విపక్షాల ప్రశ్న వేరే. పేదలు, వలస కార్మికులు, పత్రాలు తక్కువగా ఉన్న కుటుంబాలు, కొత్త ఓటర్లు వంటి వర్గాలకు అదనపు ఆధారాలు సమర్పించడం కష్టమైతే వారి పేర్లు జాబితా నుంచి తప్పిపోయే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు ఈ ప్రక్రియను "ఓటు చోరీ"గా అభివర్ణిస్తూ, జాబితా నుంచి భారీ సంఖ్యలో పేర్లు తొలగించడం వెనుక రాజకీయ ప్రభావం ఉండొచ్చని ఆరోపిస్తున్నారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తున్నాయి. చెల్లని పేర్లను తొలగించడం ఏ రాజకీయ పార్టీకి అనుకూలం చేయడం కాదని వారి వాదన. సుప్రీంకోర్టు కూడా సర్ మొత్తం ప్రక్రియను చట్టపరమైన పరిధిలోనే ఉందని గతంలో పరిశీలించినప్పటికీ, ఇప్పుడు అమలు విధానంపై వచ్చిన ప్రత్యేక ఆరోపణలను పరిశీలిస్తోంది. అందువల్ల సర్‌ను పూర్తిగా చట్టవిరుద్ధం అని చెప్పడం కూడా, దానిలో ఎలాంటి సమస్య లేదని తేల్చడం కూడా ఈ దశలో తొందరపాటు అవుతుంది. అసలు పరీక్ష ప్రతి తొలగింపుకు కారణం, ప్రతి అభ్యంతరానికి స్పందన, ప్రతి కొత్త నమోదుకు అనుసరించిన నిబంధనలే.

బీజేపీతో సంబంధం అనే ఆరోపణకు ఆధారమేంటి?

జ్ఞానేశ్ కుమార్‌కు బీజేపీ పెద్దలతో ప్రత్యక్ష వ్యక్తిగత సంబంధం ఉందని నిర్ధారించే ఆధారం ప్రస్తుత రికార్డుల్లో కనిపించడం లేదు. అయితే ఆయన గతంలో నిర్వహించిన విధుల కారణంగా విపక్షాలు రాజకీయ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా పనిచేసిన ఆయన కేంద్ర హోంశాఖలో జాయింట్ సెక్రటరీ, అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు రూపకల్పనలో ఆయన పాత్ర ఉంది. అయోధ్య తీర్పు తర్వాత ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రభుత్వ అమలు వ్యవస్థలో కూడా ఆయన కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇవన్నీ నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న అత్యంత ప్రాధాన్య రాజకీయ నిర్ణయాలకు సంబంధించిన పరిపాలనా బాధ్యతలు. దీనినే విపక్షాలు ఆయన నేపథ్యంపై ప్రశ్నలు లేవనెత్తడానికి ఉపయోగిస్తున్నాయి. అయితే ఒక అధికారి కేంద్ర ప్రభుత్వంలో పనిచేశాడనే కారణంతో ఆయన రాజకీయంగా ఒక పార్టీకి చెందినవాడని నిర్ధారించడం సాధ్యం కాదు. మరో ముఖ్య అంశం ఆయన ఎన్నికల కమిషనర్‌గా నియమించబడిన విధానం. 2023లో వచ్చిన కొత్త చట్టం ప్రకారం ఎన్నికల కమిషనర్ల ఎంపిక ప్యానెల్‌లో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రివర్గం నుంచి నామినేట్ అయిన ఒక మంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత ఉన్నారు. ఈ చట్టంలో ప్రధాన న్యాయమూర్తి స్థానాన్ని తొలగించడంపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. జ్ఞానేశ్ కుమార్ ఈ కొత్త విధానంలో నియమించబడిన తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యారు. అందుకే విపక్షాల విమర్శ ఏమిటంటే, ఎన్నికల సంఘం నియామక వ్యవస్థలోనే కార్యనిర్వాహక ప్రభావం పెరిగిందని. దీనికి ప్రభుత్వం, బీజేపీ వాదన మాత్రం చట్టబద్ధమైన ఎంపిక ప్రక్రియనే అమలు చేశామంటోంది.

ఎన్నికల సంస్థపై నమ్మకమే అసలు పరీక్ష

జ్ఞానేశ్ కుమార్ వివాదం ఒక్క వ్యక్తి చుట్టూ తిరిగే రాజకీయ ఘర్షణగా మాత్రమే చూడలేని స్థాయికి చేరింది. ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాల్లో పారదర్శకత ఉందా, ముగ్గురు కమిషనర్ల పాత్ర సమానంగా ఉందా, చట్టబద్ధమైన ఫారాల్లో మార్పులు సరైన విధానంలో జరిగాయా, కోట్లాది ఓటర్ల పేర్లపై ప్రభావం చూపే సర్‌లో సరైన రక్షణలు ఉన్నాయా అనే ప్రశ్నలు ఇప్పుడు న్యాయపరిశీలనకు వచ్చాయి. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న నివేదిక, ఫామ్ 6 విషయంలో సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు ఈ వివాదానికి కీలక మలుపుగా మారాయి. కోర్టు జ్ఞానేశ్ కుమార్‌ను దోషిగా ప్రకటించలేదు. ఆయనను తక్షణం సస్పెండ్ చేయాలన్న అభ్యర్థనపై కూడా వెంటనే మధ్యంతర ఉత్తర్వు ఇవ్వకుండా, ఎన్నికల సంఘం, కేంద్రం నుంచి సమాధానాలు కోరింది. అంటే అసలు నిజాలు ఇంకా న్యాయపరిశీలనలోనే ఉన్నాయి. ఇదే సమయంలో విపక్షాలు మాత్రం ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల సంఘం తన నిర్ణయాలు చట్టబద్ధమైనవేనని, సర్ ఓటర్ల హక్కులను రక్షించే ప్రక్రియేనని చెబుతోంది. ఈ పరిస్థితిలో "ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు" అనే రాజకీయ కోణం కంటే "నిర్ణయం ఎలా తీసుకున్నారు?" అనే సంస్థాగత ప్రశ్నే ముఖ్యమైనది. ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం ఉండటం ఎన్నికల ఫలితాల కంటే కూడా కీలకం. ఓటరు తన పేరు జాబితాలో ఉందని నమ్మాలి. అభ్యర్థి తనకు సమాన అవకాశం ఉందని నమ్మాలి. రాజకీయ పార్టీకి ప్రక్రియ పారదర్శకంగా ఉందన్న నమ్మకం ఉండాలి. ఈ మూడు నమ్మకాల్లో ఏ ఒక్కటి బలహీనపడినా ఎన్నికల వ్యవస్థపై అనుమానం మొదలవుతుంది. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రస్తుతం వచ్చిన ఆరోపణలు చివరికి నిజమా, తప్పా అనేది న్యాయపరమైన పరిశీలన, అధికారిక రికార్డులు నిర్ణయించాలి. కానీ ఈ వివాదం ఇప్పటికే ఒక పెద్ద ప్రశ్నను దేశం ముందుంచింది... ఎన్నికలను నిర్వహించే సంస్థపై నమ్మకాన్ని కాపాడేందుకు పారదర్శకత ఎంత అవసరమో చెబుతోంది.. ఈ ప్రశ్నకు సమాధానం దొరికే వరకు జ్ఞానేశ్ వివాదం కొనసాగుతూనే ఉంటుంది.



ఫామ్ 6 మార్పుల వివాదం

రెండో ప్రధాన వివాదం కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్ 6 చుట్టూ తిరుగుతోంది. సర్ సమయంలో ఈ ప్రక్రియకు అదనపు డిక్లరేషన్ జతచేశారు. ఇందులో గత సర్ జాబితాలో దరఖాస్తుదారు లేదా తల్లిదండ్రులు, తాతముత్తాతల పేర్లు ఉన్నాయా వంటి వివరాలు కోరినట్లు పిటిషన్లలో ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల సంఘం దీన్ని సర్ ప్రక్రియలో భాగమైన అదనపు ప్రకటనగా వివరిస్తోంది. అయితే విమర్శకుల వాదన వేరుగా ఉంది. ఫామ్ 6 ఒక చట్టబద్ధమైన ఫామ్ కావడంతో దానిలో మార్పులు చేయాలంటే సంబంధిత ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారిక ప్రక్రియ అవసరమని వారు చెబుతున్నారు. ఇదే అంశంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు కోర్టుకు సమర్పించిన పిటిషన్లు పేర్కొన్నాయి. వివాదం మరింత తీవ్రమైంది అక్టోబర్ 5న. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మార్చిన ఫామ్ 6కు సుప్రీంకోర్టు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసింది. "మార్పు ఎవరు చేశారు?" అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకునేందుకు రికార్డులు పరిశీలించాల్సి ఉందని కోర్టు తెలిపింది. ఇక్కడే జ్ఞానేశ్ కుమార్‌పై రాజకీయ విమర్శలకు కొత్త బలం వచ్చింది. ఎందుకంటే ఎన్నికల సంఘం గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఈ ప్రకటనను సమర్థించినట్లు విమర్శలు వచ్చాయి. కోర్టు మాత్రం తాను ఫామ్ 6లో చేసిన మార్పులను ఆమోదించలేదని స్పష్టం చేసింది. దీని అర్థం వెంటనే జ్ఞానేశ్ కుమార్ చట్టాన్ని ఉల్లంఘించాడని తేలిపోయిందని కాదు. అసలు మార్పు ఎవరి నిర్ణయంతో జరిగింది, దానికి చట్టపరమైన ఆధారం ఏమిటి, కమిషన్‌లో నిర్ణయం ఎలా తీసుకున్నారు అనే ప్రశ్నలకు రికార్డుల ఆధారంగా సమాధానం రావాల్సి ఉంది. ఈ అంశమే ప్రస్తుతం ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని ప్రభావితం చేస్తున్న కీలక అంశంగా మారింది.



లక్నోలో అయ్యర్ తుఫాన్.. విండీస్ చిత్తు

లక్నో వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ బ్యాట్ పవర్ చూపించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు దూకుడైన ఆరంభం ఇస్తూ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం అందుకుంది. టాస్ నుంచి మ్యాచ్ ముగిసే వరకు ఉత్కంఠ రేపిన పోరులో విండీస్ తొలుత 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. షై హోప్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ అర్ధశతకాలతో మెరుపులు మెరిపించినా, మిగతా బ్యాటర్ల నుంచి తగిన సహకారం లేకపోవడంతో భారీ స్కోరు సాధించే అవకాశం చేజారింది. 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు మాత్రం శ్రేయస్ అయ్యర్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మ్యాచ్ ఒక్కసారిగా ఏకపక్షంగా మారింది. కేవలం 42 బంతుల్లోనే శతకం బాదిన అయ్యర్ బౌండరీలు, సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించాడు. కెప్టెన్‌గా ముందు నుంచి నడిపిస్తూ చేసిన ఈ దూకుడు ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యాన్ని కేవలం 14.4 ఓవర్లలోనే ఛేదించింది. ఆసియా గేమ్స్‌లో భారత్‌కు నాయకత్వం వహించిన కొద్ది రోజులకే అయ్యర్ మరోసారి తన బ్యాట్ సత్తా చాటడంతో లక్నోలో భారత విజయోత్సవం ఘనంగా సాగింది.

అయ్యర్ విధ్వంసం.. టీ20ల్లో తొలి శతకం

లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా శ్రేయస్ అయ్యర్ బ్యాట్ మోత మోగింది. భారత కెప్టెన్ ఆరంభంలో కాస్త నెమ్మదిగా కనిపించినా, క్రీజులో కుదురుకున్నాక ఆటను మరో గేర్‌లోకి తీసుకెళ్లాడు. వరుస బౌండరీలు, సిక్సర్లతో వెస్టిండీస్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ పరుగుల వరద పారించాడు. ముఖ్యంగా 13వ ఓవర్లో మూడు సిక్సర్లు కొట్టి ఒక్కసారిగా గర్జించిన అయ్యర్.. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 36 బంతుల్లో 72 పరుగుల వద్ద ఉన్న అతడు, తర్వాతి ఓవర్లోనే మరో సిక్సర్, ఫోర్‌తో వేగాన్ని మరింత పెంచాడు. 41 బంతుల్లో 95 పరుగులకు చేరుకున్న అయ్యర్.. 14.3వ బంతికి రోస్టన్ చేజ్‌ను లాంగ్‌ఆన్ మీదుగా భారీ సిక్సర్‌గా మలిచి తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని ఘనంగా పూర్తి చేశాడు. కేవలం 42 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్న అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. చివరికి 43 బంతుల్లో 102 పరుగులతో అజేయంగా నిలిచిన అయ్యర్.. 237.20 స్ట్రైక్‌రేట్‌తో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఏకానాలో ఇది అతడికి వరుసగా రెండో శతకం కాగా, చివరి మూడు ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేసి ఔట్ కాకపోవడం అతడి ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచింది.



కెప్టెన్సీకి హర్మన్‌ప్రీత్ గుడ్‌బై

భారత మహిళల క్రికెట్‌లో ఓ కీలక అధ్యాయం ముగిసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీకి వీడ్కోలు పలికింది. 2016లో నాయకత్వ బాధ్యతలు చేపట్టిన ఆమె.. దాదాపు దశాబ్ద కాలం పాటు జట్టును ముందుండి నడిపించింది. ప్రపంచకప్ విజయం, ఆసియా క్రీడల్లో స్వర్ణం వంటి చారిత్రక విజయాల్లో హర్మన్‌ప్రీత్ నాయకత్వం కీలకంగా నిలిచింది. అయితే ఇటీవలి ఫలితాలు, టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు భారత్ చేరుకోలేకపోవడం, బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో ఆమె కెప్టెన్సీపై ఒత్తిడి పెరిగింది. బీసీసీఐ సమావేశం తర్వాత తీసుకున్న నిర్ణయాన్ని హర్మన్‌ప్రీత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. కెప్టెన్సీ కోసం తన రక్తం, చెమట, సమయం, వ్యక్తిగత ఆశయాలను సైతం పక్కన పెట్టానని భావోద్వేగంగా చెప్పింది. కఠిన నిర్ణయాలు తీసుకున్నా, ప్రతి అడుగు జట్టు అభివృద్ధి కోసమేనని స్పష్టం చేసింది. ఇప్పుడు కెప్టెన్సీ భారాన్ని పక్కనపెట్టి, ఆటగాడిగా కొత్త అధ్యాయానికి సిద్ధమవుతున్నానని ప్రకటించింది. కెప్టెన్సీ ముగిసినా భారత క్రికెట్‌పై ప్రేమ మాత్రం కొనసాగుతుందని చెప్పిన హర్మన్‌ప్రీత్.. ఇక స్వేచ్ఛగా బ్యాట్ ఊపేందుకు సిద్ధమైంది.



ఎన్నాళ్లకెన్నాళ్లకు.. భువీ రీ ఎంట్రీ

దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి భువనేశ్వర్ కుమార్ గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చాడు. న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ ప్రకటించిన జట్టులో అనుభవజ్ఞుడైన పేసర్‌కు చోటు దక్కడం సంచలన నిర్ణయంగా మారింది. 2022 తర్వాత మళ్లీ టీమిండియా జెర్సీ ధరించనున్న భువీ.. ఐపీఎల్ 2026లో తన పునరాగమనానికి బలమైన ముద్ర వేశాడు. 16 మ్యాచ్‌ల్లో 28 వికెట్లు పడగొట్టి టోర్నీలో రెండో అత్యధిక వికెట్ టేకర్‌గా నిలిచాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టైటిల్ సాధించడంలో అతడి బౌలింగ్ కీలకంగా నిలిచింది. స్వింగ్, కచ్చితమైన లైన్, డెత్ ఓవర్లలో అనుభవం భువీకి మరోసారి జాతీయ జట్టు తలుపులు తెరిచాయి. అజిత్ అగార్కర్ నిష్క్రమణ తర్వాత ప్రజ్ఞాన్ ఓజా తాత్కాలిక చైర్మన్‌గా ఉన్న సెలక్షన్ కమిటీ ప్రకటించిన తొలి టీ20 జట్టులోనే భువీకి అవకాశం దక్కింది. గాయంతో ఆసియా క్రీడలకు దూరమైన వరుణ్ చక్రవర్తి కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 1 వరకు న్యూజిలాండ్‌లో ఐదు టీ20లు జరగనున్నాయి. నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించిన భువీ.. మళ్లీ భారత పేస్ దళంలో తన మార్క్ చూపించేందుకు సిద్ధమయ్యాడు.

గంగూలీ ఇన్.. అగార్కర్ ఔట్

భారత క్రికెట్‌లో ఒకేసారి రెండు కీలక మార్పులు

చోటుచేసుకున్నాయి. ఐపీఎల్‌లో సౌరవ్ గంగూలీ కొత్త పాత్రలోకి దూసుకొచ్చాడు. ఐపీఎల్ 2027 సీజన్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా గంగూలీ నియమితుడయ్యాడు. గతంలో ఢిల్లీ ఫ్రాంచైజీకి డైరెక్టర్ ఆఫ్ క్రికెట్, మెంటార్‌గా పనిచేసిన దాదా ఇప్పుడు తొలిసారి ఐపీఎల్‌లో ప్రధాన కోచ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. హేమంగ్ బదానీ కోచింగ్ బృందం స్థానంలో గంగూలీ నేతృత్వంలో కొత్త అధ్యాయం మొదలుకానుంది. తనకు ఎంతో అనుబంధం ఉన్న ఢిల్లీ జట్టును టైటిల్ దిశగా నడిపించడమే లక్ష్యమని గంగూలీ స్పష్టం చేశాడు.
మరోవైపు పురుషుల జాతీయ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా అజిత్ అగార్కర్ పదవీకాలం అక్టోబర్ 4తో ముగియగా, బీసీసీఐ తాజాగా కొత్త సెలెక్టర్ కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. అగార్కర్ తన పదవీకాలాన్ని పొడిగించుకోబోనని ముందుగానే బీసీసీఐకి తెలియజేసిన నేపథ్యంలో ఈ మార్పు జరిగింది. ప్రస్తుతం ప్రజ్ఞాన్ ఓజా తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, శివ్‌సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్ సెలక్షన్ ప్యానెల్‌లో ఉన్నారు. ఒకవైపు సెలక్షన్ కమిటీలో అగార్కర్ నిష్క్రమణ.. మరోవైపు కోచ్‌గా గంగూలీ ఎంట్రీతో భారత క్రికెట్‌లో కొత్త సమీకరణాలు ఆసక్తి రేపుతున్నాయి.





ఓటీటీలో జాతర

రెండు రోజుల్లో.. ఏడు సినిమాలు









సినిమా థియేటర్ తలుపులు మూసుకున్నా.. కథలు ఆగవు. ఈ వారం ఓటీటీ తెరపైకి అడుగుపెట్టే దక్షిణాది సినిమాలు, సిరీస్‌లు ప్రేక్షకుల కోసం విభిన్నమైన ప్రపంచాలను సిద్ధం చేశాయి. ఒకవైపు సూరి నటించిన 'మండాడి'లో గౌరవం కోసం జరిగే పడవల రేసు.. మరోవైపు పృథ్వీరాజ్ సుకుమారన్ 'ఖలీఫా: ది రూలర్'లో సాధారణ కుటుంబ వ్యక్తి నుంచి బంగారం సామ్రాజ్యాధిపతిగా మారే సంచలన ప్రయాణం. మధ్యలో దాగిన నేరాలు, బయటపడని కుటుంబ రహస్యాలు, ప్రమాదకరమైన స్టాకింగ్, పెళ్లి ఒత్తిడిలో చిక్కుకున్న యువకుడి కథ, గడువు పెట్టుకున్న ప్రేమ.. ఇలా ప్రతి కథా మరో ప్రపంచంలోకి తీసుకెళ్లనుంది. 'ప్రథమ దృష్ట్యా కుట్టక్కర్'లో నిజాన్ని దాచేందుకు ఓ అధికారి వేసే ఎత్తుగడలు ఎక్కడికి దారితీస్తాయి? 'ఐస్'లో మహిళలను వెంటాడుతున్న ఆ నీడ అసలు ఎవరిది? 'పారిస్ కేఫ్'లో ఏడేళ్లుగా దాచిన కుటుంబ రహస్యం ఏంటి? 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'లో తొమ్మిది నెలల బంధం నిజమైన ప్రేమగా మారిన తర్వాత ఏం జరుగుతుంది? ఇక 'ఖలీఫా' ముగింపులో బయటపడే ఆ రహస్యం.. తడుపరి కథకు ఎలాంటి తలుపు తెరుస్తుంది? ఈ వారం ఓటీటీలో ఏడు కథలు.. ఏడు భిన్నమైన అనుభూతులు. మీ వాచ్‌లిస్ట్‌లో మొదటి స్థానం దక్కించుకునేది ఏది?

1. మండాడి.. రేసులో గెలిచేది ఎవరు?

తమిళ నటుడు సూరి ప్రధాన పాత్రలో నటించిన మండాడి స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. మతిమారన్ పుగళేంధి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సూరితో పాటు సుహాస్, మహిమా నంబియార్, సత్యరాజ్, కృష్ణ హాసన్, మిథున్ జై శంకర్ తదితరులు నటించారు. అక్టోబర్ 8 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. కథలో మారి అనే యువకుడు తన గ్రామంలో మరుగునపడిన పడవల రేసింగ్ జట్టును తిరిగి నిలబెడతాడు. అయితే ఆ ప్రయత్నం అతడిని శక్తివంతమైన సత్తాపులి, అతడి బలమైన జట్టుతో నేరుగా పోటీ పడే పరిస్థితికి తీసుకెళ్తుంది. మారి ప్రాణానికే ప్రమాదం ఏర్పడటంతో గతంలో ఓ విషాద ఘటన కారణంగా రేసింగ్‌కు దూరమైన అతడి మామ కాళి తిరిగి రంగంలోకి దిగుతాడు. స్థానిక మత్స్యకారులతో కూడిన జట్టుకు శిక్షణ ఇచ్చి వారిని కీలకమైన చివరి రేసుకు సిద్ధం చేస్తాడు. పాత ద్రోహాలు, కుటుంబ రహస్యాలు బయటపడటంతో కథ మరింత ఉత్కంఠగా మారుతుంది. గౌరవాన్ని తిరిగి సాధించేందుకు జరిగే ఆ చివరి పోరాటమే సినిమాకు ప్రధాన ఆకర్షణ.

2. ప్రథమ దృష్ట్యా కుట్టక్కర్.. దాచిన నిజం

మలయాళంలో రూపొందిన ప్రథమ దృష్ట్యా కుట్టక్కర్ డ్రామా నేపథ్యంలో సాగే ఉత్కంఠభరితమైన కథ. పార్వతి తిరువోతు, మాథ్యూ థామస్, విజయరాఘవన్, సిద్ధార్థ్ భరతన్, ఉన్నిమాయ ప్రసాద్, వినయ్ ఫోర్ట్ తదితరులు నటించిన ఈ చిత్రానికి షహద్ నిలంబూర్ దర్శకత్వం వహించారు. అక్టోబర్ 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. కొత్తగా విధుల్లో చేరిన అధికారి అలీనా అబ్రహామ్ ఒక అనూహ్యమైన ప్రాణాంతక ఘటనలో చిక్కుకుంటుంది. ఆ ఘటనను తన సహచరులతో కలిసి దాచిపెట్టేందుకు ఆమె ప్రయత్నిస్తుంది. కానీ హారిస్ మీరాన్ దర్యాప్తు మొదలుపెట్టడంతో పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. ఒక్కొక్కటిగా దాచిన విషయాలను బయటకు తీస్తున్న హారిస్‌ను ఎదుర్కొనేందుకు అలీనా తన తెలివిని ఉపయోగిస్తుంది. దర్యాప్తు నుంచి తప్పించుకునేందుకు కొత్త మార్గాలను సృష్టిస్తూ, ప్రత్యర్థి ఆలోచనలను ముందుగానే అంచనా వేస్తుంది. చివరకు ఆమె వేసే పక్కా వ్యూహం దర్యాప్తు అధికారినే ఆశ్చర్యపరిచే స్థాయికి చేరుతుంది. నిజం దాచేవారు, నిజాన్ని బయటకు తీయాలనుకునేవారి మధ్య జరిగే మైండ్ గేమ్ ఈ సినిమాకు కీలకం.

3. లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్.. పెళ్లి ఒత్తిడి

తెలుగు ప్రేక్షకులను నవ్వించేందుకు వస్తున్న కామెడీ డ్రామా సిరీస్ లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్. హర్ష చెముడు, హైపర్ ఆది, ఐశ్వర్య హోలక్కల్, జీవన్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటించారు. బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ సిరీస్ అక్టోబర్ 9 నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. కథ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఓ యువకుడి చుట్టూ తిరుగుతుంది. వయసు పెరుగుతున్న కొద్దీ పెళ్లి చేసుకోవాలంటూ కుటుంబం, సమాజం నుంచి అతడిపై ఒత్తిడి పెరుగుతుంది. అయితే అతడి వ్యక్తిత్వం, పరిస్థితులు కారణంగా పెళ్లికి సరైన వ్యక్తిగా ఎవరూ భావించరు. దీంతో అతడి జీవితంలో వరుసగా విచిత్రమైన పరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమ, కుటుంబ ఒత్తిడి, వ్యక్తిగత నిర్ణయాల మధ్య అతడు ఎదుర్కొనే పరిస్థితులు కథలో వినోదాన్ని పంచనున్నాయి. పెళ్లి విషయంలో సమాజం పెట్టే అంచనాలను హాస్యంతో చూపించే ప్రయత్నంగా ఈ సిరీస్ నిలవనుంది.

4. పారిస్ కేఫ్.. ఏడేళ్ల రహస్యం

తమిళంలో రూపొందిన పారిస్ కేఫ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. గురు సోమసుందరం, అనుమోల్, విజయ్ విశ్వ, నయన సాయి, సాయి విక్కీ, బిపిన్ కుమార్ నటించిన ఈ చిత్రానికి సరాజ్ శీలన్ దర్శకత్వం వహించారు. అక్టోబర్ 9 నుంచి ప్రైమ్ వీడియో, ఆహా వీడియో, సింప్లీ సౌత్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఒలివిజియాల్ అనే ఓ యువతి పారిస్ పర్యటనకు వెళ్లాలని కలలు కంటుంది. కానీ అక్కడికి వెళ్లే సమయంలో ఆమె కుటుంబానికి సంబంధించిన అనుకోని నిజం బయటపడుతుంది. ఆమె తల్లిదండ్రులు డాక్టర్ గౌతమ్, తారా విడిపోయి ఉంటారు. ఏడేళ్ల క్రితం జరిగిన ఓ ఘటనకు సంబంధించిన ఫొటో, దాచిపెట్టిన ఓ రహస్యం ఆమెను గతాన్ని వెతికేలా చేస్తాయి. తన జీవిత భాగస్వామి కావిన్ సహాయంతో ఒలి ఒక్కొక్క విషయాన్ని కలుపుకుంటూ వెళ్తుంది. చివరకు తన తల్లిదండ్రుల బంధం ఎందుకు విచ్ఛిన్నమైందో తెలుసుకుంటుంది. ఏళ్లుగా దాచిన నిజాన్ని ఎదుర్కొన్నప్పుడే కుటుంబానికి మళ్లీ కలిసే అవకాశం వస్తుందా? అనే ప్రశ్న చుట్టూ కథ సాగుతుంది.

5. ఐస్.. వెంటాడుతున్న నీడ ఎవరిది?

మలయాళంలో రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్ సిరీస్ ఐస్ కూడా ఈ వారం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కాని కుసృతి, శ్రుతి రామచంద్రన్, నిఖిల విమల్, సానియా అయ్యప్పన్, దేవ్ మోహన్ నటించిన ఈ సిరీస్‌కు మను అశోకన్ దర్శకత్వం వహించారు. అక్టోబర్ 9 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది. టీనా సెబాస్టియన్ అనే ధైర్యవంతమైన అధికారి వరుసగా జరుగుతున్న అనుమానాస్పద ఘటనలను దర్యాప్తు చేస్తుంది. మహిళలను రహస్యంగా గమనించడం, వారిని వేధించడం వంటి ఘటనలు ఒకదానితో ఒకటి సంబంధం ఉన్నాయని ఆమె గుర్తిస్తుంది. సాధారణ సంబంధాల వెనుక దాగి ఉన్న ప్రమాదకరమైన స్టాకింగ్ వ్యవస్థను ఆమె బయటకు తీసేందుకు ప్రయత్నిస్తుంది. మానసిక ఆరోగ్య నిపుణుల సహాయంతో నిందితుల ప్రవర్తనను, వారి ఆలోచనా విధానాన్ని పరిశీలిస్తుంది. ఒక వ్యక్తి సాధారణ అభిమానం నుంచి ప్రమాదకరమైన మోజు వైపు ఎలా మారుతాడన్నదానిపై దర్యాప్తు సాగుతుంది. కేసు లోతుల్లోకి వెళ్లే కొద్దీ బాధితుల చుట్టూ దాగి ఉన్న మరిన్ని రహస్యాలు బయటపడతాయి. ప్రమాదం బయట ఎక్కడో లేదని, మనకు అత్యంత దగ్గరలోనే ఉండొచ్చన్న భయం ఈ కథలో ఉత్కంఠను పెంచుతుంది.

6. ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్.. ప్రేమకు గడువు

తెలుగు ప్రేక్షకుల కోసం వస్తున్న రొమాంటిక్ కామెడీ ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్‌లో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటించారు. శివాజీ, వాసుకి, కళ్యాణ్ శంకర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఆదిత్య అనే యువకుడు దర్శకుడు కావాలన్న కలతో జీవిస్తుంటాడు. ఉన్నత చదువుల కోసం కుటుంబం అతడిని లండన్‌కు పంపిస్తుంది. అక్కడ విశాఖపట్నానికి చెందిన స్వతంత్ర భావాలు కలిగిన కాదలిని కలుస్తాడు. ఇద్దరూ ఫ్లాట్‌మేట్స్‌గా మారి, తొమ్మిది నెలల గడువుతో ఓ క్యాజువల్ రిలేషన్‌షిప్‌కు అంగీకరిస్తారు. కానీ కాలం గడిచే కొద్దీ ఆ బంధం నిజమైన ప్రేమగా మారుతుంది. ఒకవైపు కెరీర్ కలలు, మరోవైపు భవిష్యత్తుపై భిన్నమైన ఆలోచనలు వారి సంబంధానికి పరీక్షగా నిలుస్తాయి. గడువు ముగిసే సమయం దగ్గరపడే కొద్దీ తమ ప్రేమను కొనసాగించాలా, విడిపోవాలా అన్న నిర్ణయం వారి ముందుంటుంది. తొమ్మిది నెలల ఒప్పందం నిజమైన జీవిత బంధంగా మారినప్పుడు ఏం జరుగుతుందన్నదే ఈ కథలో అసలు ఆసక్తి.

7. ఖలీఫా: ది రూలర్.. సామ్రాజ్యానికి వారసుడు

ఈ వారం జాబితాలో అత్యంత భారీ యాక్షన్ సినిమాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉన్న చిత్రం ఖలీఫా: ది రూలర్. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ మలయాళ యాక్షన్ థ్రిల్లర్‌కు వైశాఖ్ దర్శకత్వం వహించారు. నీల్ నితిన్ ముఖేష్, మాళవిక శర్మ, షమ్మీ తిలకన్, ఇంద్రన్స్, రంజీ పనికర్, మోహిని, శివజిత్, సురేశ్ ఒబెరాయ్ తదితరులు నటించారు. మోహన్‌లాల్, టొవినో థామస్ అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. అక్టోబర్ 9 నుంచి ప్రైమ్ వీడియో, సింప్లీ సౌత్, మనోరమా మ్యాక్స్, ఆహా వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. కోలీవుడ్‌లో సాధారణ వస్త్ర దుకాణం నడిపే ఆమీర్ అలీ జీవితం ఒక్కసారిగా తలకిందులవుతుంది. బంగారం వ్యాపారానికి సంబంధించిన ఓ పెద్ద వ్యవహారంలో అతడి తండ్రిని ఇరికిస్తారు. కుటుంబాన్ని కాపాడటంతో పాటు తండ్రి నిర్దోషిత్వాన్ని నిరూపించేందుకు ఆమీర్ గతాన్ని వెతకడం మొదలుపెడతాడు. అప్పుడు అతడి కుటుంబ చరిత్రలో దాగి ఉన్న భయంకరమైన నిజం బయటపడుతుంది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.